మానేరు **జనత**®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

05.05.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 17 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar

## పంజాబ్ అద్భుత ప్రదర్శన

37 రన్స్ తేడాతో లఖ్‌నవూ ఓటమి




06

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# ఏపీ నీటి దోపిడీకి బీఆర్ఎస్ మద్దతు

కృష్ణా నది నుంచి 512 టీఎంసీలు తరలించుకోపోతున్నా పట్టించుకోలేదు

న్యాయమైన వాటాకు సర్కారు పోరాటం

ఎస్ఎల్‌బీసీ పనులపై నిపుణుల కమిటీ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీకి బీఆర్ఎస్ ప్రభుత్వమే మద్దతు పలికిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు కృష్ణానది నుంచి ఏపీ ఏటా 512 టీఎంసీల నీటిని తరలించుకుపోతుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు.

04

# మీరు కోరుకునేదే జరగబోతోంది


## పహెల్గాం ఉగ్రదాడిపై త్వరలో తీవ్ర ప్రతిస్పందన

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే చర్యలు

దేశంవైపు కన్నెత్తి చూస్తే మొహం పగలగొడుతాం

అవసరమైన సమయంలో ప్రతీకార దాడులు

రక్షణ శాఖ మంత్రి సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జనతా న్యూస్:** పహెల్గాం ఉగ్రదాడి తర్వాత నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, పాక్ మధ్య యుద్ధం జరుగుతుందని ఆందో ళనలు నెలకొన్న వేళ కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ సంచలన ప్రకటన చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ ప్రజలు కోరుకునేది కచ్చితంగా జరిగి తీరుతుందని నొక్కి చెప్పారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ప్రజలు ఆకాంక్షించేదే జరుగుతుందన్నారు. ఉగ్రదాడిపై కఠినంగా స్పందిస్తామని త్వరలోనే తగిన ప్రతిస్పందన ఉంటుం దని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవంలో ఆయన ప్రసంగిం చారు. 'ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం గురించి బాగా తెలుసు. ఆయన

మిగతా 2 లో

### పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర

బహుళజాతి కంపెనీలు చైనా నుంచి భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే దాడి

పాక్ రిటైర్డ్ ఆర్మీ మేజర్ అదిల్ రజా సంచలన ఆరోపణ



02

### గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

అప్పట్లో నేను లేను.. అయినా పార్టీ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ సంతోషంగా బాధ్యత వహిస్తా

సిక్కు వ్యతిరేక అల్లర్లపై ఓ సిక్కు విద్యార్థి ప్రశ్నకు రాహుల్ జవాబు

గత నెల అమెరికాలో బ్రౌన్‌వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి

## మావోయిస్టులతో చర్చల ప్రసక్తేలేదు



02

తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే

కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే

నక్సల్‌కు సీఎం రేవంత్, కేసీఆర్ మద్దతు సరికాదు

వారిపై నిషేధం ఎత్తేసే దమ్ము రాష్ట్రానికి ఉందా..?

పాక్ పౌరులపై రాష్ట్ర సర్కారు నామమాత్ర చర్యలు

కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మావోయిస్టులు తుపాకీ వీడాల్సిందేనని, పోలీసులకు లొంగిపోవాల్సిందేనని అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.



## అకాల వర్షం.. తీరని నష్టం

పలు జిల్లాల్లో వాన, ఈదురుగాలుల బీభత్సం

కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం

కూలిన చెట్లు, స్తంభాలు.. నేలరాలిన మామిడి

సిద్దిపేటలో టోల్‌ప్లాజా పైకప్పు రేకులు కూలి కౌంటర్లు ధ్వంసం.. గంటపైగా ట్రాఫిక్ జామ్

02

## ఒక్కరోజే 90 మంది అందగత్తెల రాక

నేడు రానున్న మరికొందరు

90 మంది అందగత్తెల రాకతో శంషాబాద్‌లో సందడి

02








02

### ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం

నేడు, రేపు.. ఎప్పుడొచ్చినా చర్చిస్తాం: పొన్నం



03

### డిగ్రీ పరీక్షలు చేపట్టకపోవడం ప్రభుత్వ అసమర్థత

రేవంత్‌వి గాలి మాటలు: హరీశ్‌రావు



## 10 నుంచి మెట్రో చార్జీల పెంపు

25-30% పెంచేందుకు ఎల్ అండ్ టీ నిర్ణయం

అనుమతి కోసం 8న సీఎం రేవంత్ రెడ్డితో భేటీ

కనిష్ఠంగా రూ.15.. గరిష్ఠంగా రూ.75 వరకు ఉండే చాన్స్

03

## కర్రెగుట్టల్లో దొరకని నక్సల్స్ ఆచూకీ

రెండో రోజే తప్పించుకున్న మావోయిస్టులు?

ఇంకా 30కి పైగా గుట్టల్లో గాలింపు పెండింగ్

ప్రతికూల వాతావరణంలో చతికిలపడిపోతున్న పారామిలిటరీ బలగాలు.. పలువురికి డీహైడ్రేషన్

3 వేల మందికి పైగా నక్సల్స్ ఉన్నారని తొలుత ప్రచారం.. ఇప్పటికి ఆరుగురి ఎన్‌కౌంటర్

04





## అత్యంత కఠినంగా నీట్



విద్యార్థుల్ని బెంబేలెత్తించిన ఫిజిక్స్ ప్రశ్నలు.. 45 ప్రశ్నలకుగాను 25 రాస్తే గొప్పే

మిగతా సబ్జెక్టుల్లోనూ కష్టమైన ప్రశ్నలే.. 450 స్కోర్ వస్తే జనరల్ కేటగిరీలో సీటు!

గడియారాలు లేక.. సమయం తెలియక ఇబ్బందిపడ్డ విద్యార్థులు..

95% హాజరు... జూన్ 14న ఫలితాలు.. నెలాఖరులోగా కీ

03

# మావోయిస్టులతో చర్చల ప్రసక్తేలేదు

**తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే**
**కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**
**తుపాకీ వీడాల్సిందే.. పోలీసులకు లొంగిపోవాల్సిందే**
**నక్సల్‌కు సీఎం రేవంత్, కేసీఆర్ మద్దతు సరికాదు**
**వారిపై నిషేధం ఎత్తేసే దమ్ము రాష్ట్రానికి ఉందా..?**
**పాక్ పౌరులపై రాష్ట్ర సర్కారు నామమాత్ర చర్యలు**
**కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



కరీంనగర్, మే 4 : మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మావోయిస్టులు తుపాకీ వీడాల్సిందేనని, పోలీసులకు లొంగిపోవాల్సిందేనని అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టుల సమస్యను సామాజిక కోణంలో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కగార్ ఆపాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. మావోయిస్టులు బాంబులు పెట్టి పోలీసులు, రాజకీయ నాయకులను చంపుతుంటే సామాజిక కోణంలో చూడాలా..? అని ప్రశ్నించారు. మావోయిస్టులపై నిషేధం విధించింది కాంగ్రెస్ పాలకులేనని చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా..? అని సవాల్ విసిరారు. మావోయిస్టులు తుపాకులు చేతిలో పట్టుకొని అమాయకులైన గిరిజనులు, పోలీసులను కాల్చి చంపుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ టీడీపీలో ఉన్న సమయంలో మావోయిస్టులు ఎంతో మంది నాయకులను చంపేశారని తెలిపారు. గిరిజనులను, అమాయకులను ఇన్‌ఫార్మర్ల పేరుతో కాల్చి చంపుతుంటే సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు. పాకిస్తాన్ పౌరులను తిరిగే పంపే అంశంపై కేంద్రం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు ఇచ్చిందని, దేశమంతా దీనిపై సీరియ్‌సగా చర్యలు తీసుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదని విమర్శించారు. ఇప్పటికే చాలా మంది పాస్‌పోర్టు, వీసాలు లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రోహింగ్యాలు కూడా చాలా మంది ఉన్నారని, వారిపై కాంగ్రెస్ వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. దీనిని శాంతి భద్రతల సమస్యగా చూడాలే తప్ప మత కోణంలో, రాజకీయ లబ్ధి కోసం చూస్తే హైదరాబాద్ ఉగ్రవాదులకు అడ్డాగా మారే ప్రమాదముందని అన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎసఏ నివేదిక ఇచ్చి వారం రోజులైనా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయం చరిత్రాత్మకమని, దీనిని కాంగ్రెస్ విజయమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ కులగణన సర్వేకు, మోదీ కులగణనకు పొంతనే ఉండదని చెప్పారు. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. 52 శాతం జనాభా ఉన్న బీసీలను 46 శాతంగా చూపారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని చెప్పి అందులో పది శాతం ముస్లింలకు కేటాయించారని సంజయ్ మండిపడ్డారు.

# ఒక్కరోజే 90 మంది అందగత్తెల రాక

**నేడు రానున్న మరికొందరు**
**90 మంది అందగత్తెల రాకతో శంషాబాద్‌లో సందడి**

**హైదరాబాద్ , మే 4 :** మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన అందాల బామలు హైదరాబాద్ చేరుకుంటున్నారు. శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న సుందరీమణులకు టూరిజంశాఖ అధికారులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలుకుతున్నారు. ఆదివారం మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్‌ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్‌తోపాటు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మరికొందరు పోటీదారులు వచ్చే అవకాశం ఉంది. అందగత్తెలు ఎయిర్‌పోర్టుకు చేరుకోవడంతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. అనంతరం వారిని ఆయా హెూటళ్లకు తరలించారు. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అతిథులకు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను టూరిజం శాఖ అందుబాటులోకి తెచ్చింది.



# మీరు కోరుకునేదే జరగబోతోంది

మొదటి పేజీ తరువాయి

తీసుకునే నిర్ణయాలు కఠినంగా ఉంటాయి. మోడీ నాయక త్వంలో దేశ ప్రజలు ఏది కోరుకుంటే


అది తప్పకుండా జరుగుతుంది. ఈ విషయంలో నేను హామీ ఇస్తున్నా' అని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడిపై ప్రభుత్వం అవసరమైన, సముచితమైన ప్రతీకార చర్య తీసుకుంటుందని తెలిపారు.

**ఉగ్రదాడులకు తగిన సమాధానం**

దేశ సరిహద్దులను రక్షించాలని, తమ సార్వభౌ మత్వాన్ని సవాల్ చేసే వారికి తగిన సమాధానం చెప్పాల న్నారు. రక్షణ మంత్రిగా సైనికులతో పాటు దేశాన్ని సురక్షితంగా ఉంచడ మే మా బాధ్యత అని చెప్పారు. దేశంపై డాడి చేయడానికి ధైర్యం చేసే ఎవరికైనా దీటుగా సమాధానం ఇస్తామన్నారు. వారు తీవ్ర పరిణామా లను ఎదుర్కొంటారని హెచ్చరిం చారు. దేశం బలం కేవలం సాయుధ బలగాలోనే గాక దాని సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉందన్నారు. జవాన్లు దేశ భౌతిక సరిహ ద్దులను రక్షిస్తుండగా, సాధువులు ఋషులు దేశ ఆధ్యాత్మికతను కాపాడుతు న్నారని తెలిపారు. ప్రపంచంలోని ఏ శక్తి భారతదేశాన్ని నాశనం చేయలేదని ధీమా వ్యక్తంచేశారు. భారత్ వైపు చూస్తే మొహం పగలగొడతామని స్పష్టంచేశారు.

**యుద్ధంపై పరోక్షసంకేతం!**

ఏప్రిల్ 22న పహెల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి అనంతరం పాకిస్తాన్ పట్ల దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వెల్లువె త్తాయి. పాక్పై కఠిన చర్యలు తీసుకోవా లని దేశ వ్యాప్తంగా డిమాండ్లు ఊపం దుకున్నాయి. ప్రధాని మోడీ త్రివిధ దళాల ఉన్నతాధికారులతో వరుస సమా వేశాలు నిర్వహించారు. ఉగ్రదాడిపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను



సాయుధ దళాలకే వదిలేశారు. అప్పటి నుంచి పాక్ పై భారత్ అటాక్ చేయబోతున్న దని ఉన్నాయి. మీడియా కథనాలు వస్తూనే పాకిస్థాన్కు చెందిన పలువురు ప్రతినిధులు సైతం భారత్ దాడి చేయబోతుందని. అందుకు సంబంధించి తమకు ఇంటెలిజెన్స్ సమాచారం ఉందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే దేశ రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ప్రకటన హాట్ టాపిక్గా మారింది. ఆయన వ్యాఖ్యలు పరోక్షంగా పాక్కు వార్నింగ్ ఇచ్చినట్టే ఉన్నాయని.. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం తప్పక జరగవచ నే సంకేతాలు ఇచ్చారని పలువురు భావిస్తున్నారు.

## పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర

**బహుళజాతి కంపెనీలు చైనా నుంచి భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే దాడి**
**యుద్ధం మొదలైతే భారత్‌కు కంపెనీలు పోవని యోచన**
**పాక్ రిటైర్డ్ ఆర్మీ మేజర్ అదిల్ రజా సంచలన ఆరోపణ**

**ఇస్లామాబాద్, మే 4:** పహల్గాం ఉగ్రదాడి పాక్–చైనాల ఉమ్మడి కుట్ర అని పాక్ రిటైర్డ్ ఆర్మీ అధికారి మేజర్ అదిల్ రజా ఆరోపించారు. చైనా నుంచి కంపెనీలు భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే ఈ దాడి జరిపించాయన్నారు. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య యుద్ధం వల్ల కంపెనీలు చైనాను వీడి భారత్‌కు పోతుండటమే దాడికి ప్రధాన కారణంగా ఆయన చెప్పారు. అతిపెద్ద తయారీ దారు దేశంగా ఉన్న పేరు ప్రతిష్టలు దెబ్బతింటుండటంతో కలవరపడిన చైనా.. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో కలిసి ఈ దాడికి కుట్ర పన్నిందని అదిల్ రజా వెల్లడించారు. పాక్‌తో యుద్ధానికి దిగితే భారత్‌లో కల్లోలం ఏర్పడి కంపెనీలు తరలింపు యోచన విరమించుకుంటాయనేది చైనా యోచన అన్నారు.

# అకాల వర్షం.. తీరని నష్టం

**పలు జిల్లాల్లో వాన, ఈదురుగాలుల బీభత్సం**
**కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం**
**కూలిన చెట్లు, స్తంభాలు.. నేలరాలిన మామిడి**
**సిద్దిపేటలో టోల్‌ప్లాజా పైకప్పు రేకులు కూలి కౌంటర్లు ధ్వంసం.. గంటపైగా ట్రాఫిక్ జామ్**

రాష్ట్రంలో విభన్న వాతావరణం కొనసాగుతోంది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొట్టగా.. కొన్ని జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులకు తోడు ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షం అన్నదాతలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. పలు జిల్లాల్లో పంట నష్టం వాటిల్లగా రహదారులపైన, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల రైతులను అకాల వర్షం దెబ్బ తీసింది. సిద్దిపేట జిల్లాలో ఆదివారం సాయంత్రం గంటన్నరకు పైగా కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులోని ధాన్యం నీళ్లలో కొట్టుకుపోయింది. జిల్లాలోని చిన్నకోడూర్ మండలంలో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మ–రణించాయి. అలాగే, సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ శివారులో ఉన్న టోల్‌ప్లాజా పైకప్పు రేకులు ఈదురుగాలుల దెబ్బకు కూలి నాలుగు కౌంటర్లు ధ్వంసమయ్యాయి.

దీంతో దాదాపు గంటసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. మెదక్ జిల్లాలోని చేగుం ట, నిజాంపేట, రామాయం పేట, అల్లాదుర్గం మండలాల్లో మామిడి కాయలు నేలరాలగా, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచింది. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షానికి దోమకొండ, బీబీపేట, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, తాడ్వాయి, సదాశివనగర్, భిక్కనూర్, రాజంపేటలోని కల్లాల్లోని ధాన్యం తడిచిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద ఆరబోసిన ధాన్యం నీళ్లపాలైంది. కామారెడ్డి జిల్లా బీబీపేట మండ లం తుజాల్‌పూర్‌లో పిడుగుపడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాన బీభత్సానికి కరీంనగర్ జిల్లా ఇందుర్తిలో ఇల్లు కూలిపోగా, గునుకులపల్లిలో మామిడి చెట్లు విరిగిపడ్డాయి. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో కురిసిన వడగండ్ల వాన దెబ్బకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోగా, పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. మరోపక్క, నిజామాబాద్ జిల్లా వేంపల్లిలో ఆదివారం 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కామారెడ్డి జిల్లాలో 44.7, నిర్మల్ జిల్లాలో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వడదెబ్బ వల్ల మహబూబాబాద్ జిల్లా అప్పరాజుపల్లికి చెందిన మండల సర్వయ్య(55) అనే ఉపాధి కూలి, ఖమ్మం జిల్లా ముత్తగూడెం గ్రామానికి చెందిన పాపయ్య(70) ఆదివారం ప్రాణాలు కోల్పోయారు. కాగా, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 4 రోజులతో పోలిస్తే ఆదివారం వాతావరణం కాస్త చల్లబడింది. హైదరాబాద్‌లో ఆదివారం 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవ్వగా.. రాబోయే 3 రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

# ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సిద్ధం

**నేడు, రేపు.. ఎప్పుడొచ్చినా చర్చిస్తాం: పొన్నం**



**హుస్నాబాద్ రూరల్, మే 4 :** టీజీఎస్‌ఆర్టీసీ కార్మికులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బస్టాండ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడారు. ప్రయాణానికి సంబంధించిన అంశాలపై మంత్రి కాసేపు ముచ్చటించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాపాలనలో కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఈ నెల 5, 6 తేదీల్లో తాను హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటానని చెప్పారు. గత పదేళ్లలో కార్మికుల సమ్మెతో అనేక మంది చనిపోయినా పట్టించుకోలేదన్నారు. ఒక్క ఆర్టీసీ బస్సు కొనుగోలు చేయకుండా, ఒక్క నియామకం చేపట్టకుండా గత ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ప్రజాపాలన వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రవాణా వ్యవస్థ బాగుండాలని కొత్తబస్సులు కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్టీసీలో నియామకాలు చేపట్టామని ఆయన చెప్పారు.

# గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

**అప్పట్లో నేను లేను.. అయినా పార్టీ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ సంతోషంగా బాధ్యత వహిస్తా**
**సిక్కు వ్యతిరేక అల్లర్లపై ఓ సిక్కు విద్యార్థి ప్రశ్నకు రాహుల్ జవాబు**
**గత నెల అమెరికాలో బ్రౌన్‌వర్సిటీలో విద్యార్థులతో ముఖాముఖి**
**1980లలో జరిగింది తప్పు అని ఇప్పటికే పలుమార్లు బహిరంగంగా చెప్పానని రాహుల్ వెల్లడి**



**న్యూఢిల్లీ, మే 4:** కాంగ్రెస్ పార్టీ అనేక తప్పులు చేసిందని, అయితే, అప్పుడు తాను లేనని, అయినప్పటికీ కాంగ్రెస్ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ తాను సంతోషంగా బాధ్యత వహిస్తానని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, సిక్కులతో కాంగ్రెస్ పార్టీ సంబంధాలపై అడిగిన ప్రశ్నకు రాహుల్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. 1980లలో జరిగినది 'తప్పు' అని తాను బహిరంగంగానే చెప్పానన్నారు. గతనెల 21న అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోను తాజాగా వాట్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ శనివారం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ ముఖాముఖిలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లను ఒక సిక్కు విద్యార్థి ప్రస్తావించాడు. సిక్కులతో సయోధ్య కోసం ఏం ప్రయత్నాలు చేస్తున్నారని రాహుల్‌ను ప్రశ్నించాడు. భారత్‌లో సిక్కులను తలపాగా ధరించనివ్వాలా? వద్దా? అనే అంశంపై తాను పోరాడుతున్నానని గతంలో అమెరికాకు వచ్చినప్పుడు రాహుల్ చెప్పారని కూడా ఆ విద్యార్థి గుర్తుచేశాడు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. 'ఏదైనా సిక్కులను భయపెడుతుందని నేను అనుకోవడం లేదు.

అప్పుడు నేను చేసిన ప్రకటన ఏమిటంటే.. ప్రజలు తమ మతాన్ని వ్యక్తం చేయడంలోఅసౌకర్యానికి గురవుతున్న భారతదేశం మనకు కావాలా? అని. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల విషయానికి వస్తే.. నేను లేనప్పుడు ఎన్నో తప్పులు జరిగాయి. అయినా, చరిత్రలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులన్నింటికీ నేను సంతోషంగా బాధ్యత వహిస్తాను. నేను ఎన్నోసార్లు స్వర్ణ దేవాలయానికి వెళ్లాను. భారతదేశంలో సిక్కులతో నాకు చాలా మంచి, ప్రేమపూర్వక సంబంధాలు ఉన్నాయి' అన్నారు.

**పశ్చాత్తాపం పూర్తిగా ఉండాలి:బీజేపీ**

1984లో జరిగిన సిక్కుల వ్యతిరేక అల్లర్లు తప్పేనని రాహుల్‌గాంధీ నిజంగా భావిస్తున్నట్లైతే, అందుకు బాధ్యత వహించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లైతే జగదీశ్ టైట్లర్, కమల్‌నాథ్, శ్యామ్ పిట్రోడాలను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ డిమాండ్ చేశారు. పశ్చాత్తాపం ప్రదర్శించాలంటే పూర్తిగా ప్రదర్శించాలని హితవు పలికారు. 'తప్పు జరిగిందని మీరు నిజంగా భావిస్తున్నట్లైతే ఆ ముగ్గురినీ పార్టీ నుంచి బహిష్కరించి సరిచేసుకోండి' అని సూచించారు. కాగా, రాహుల్‌గాంధీ భారతదేశంలోనే కాకుండా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పరిహాసానికి గురవుతున్నారని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. అదే ముఖాముఖి కార్యక్రమంలో రాముడిని కల్పిత పాత్రగా రాహుల్ అభివర్ణించారంటూ అమిత్ మాలవీయ మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల విశ్వాసాలను పరిహసించడం మానుకోవాలన్నారు.

# ఏపీ నీటి దోపిడీకి బీఆర్‌ఎస్ మద్దతు

**కృష్ణా నది నుంచి 512 టీఎంసీలు తరలించుకోపోతున్నా పట్టించుకోలేదు**

**న్యాయమైన వాటాకు సర్కారు పోరాటం**

**ఎస్‌ఎల్‌బీసీ పనులపై నిపుణుల కమిటీ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**మిర్యాలగూడ, మే 4 :** ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే మద్దతు పలికిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు కృష్ణానది నుంచి ఏపీ ఏటా 512 టీఎంసీల నీటిని తరలించుకుపోతుంటే బీఆర్‌ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటించి నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై సమీక్షలు నిర్వహించడంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని 80 శాతం భూములకు సాగర్ ఎడమ కాల్వ ద్వారా సాగు నీరు అందుతుండగా బ్రిజేష్ ట్రిబ్యునల్ సూచనల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను 811 టీఎంసీలు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. మూడింట రెండొంతుల నీటిని ఏపీ తరలిస్తుంటే బీఆర్‌ఎస్ నేతల్లో కనీస స్పందన కూడా లేకుండా పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు కృష్ణా నీటిలో తెలంగాణ న్యాయమైన వాటా కోసం పోరాడుతోందన్నారు. 811 టీఎంసీల్లో 70 శాతం తెలంగాణకు, 30 శాతం ఏపీకి కేటాయించాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం బలంగా వాదనలు వినిపిస్తోందని చెప్పారు.

**ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడమే లక్ష్యం**

ప్రతి ఎకరాకు నీరు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ అన్నారు. అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఎస్‌ఎల్‌బీసీ పనులను కొనసాగించడానికి నిపుణుల కమిటీని వేసి వారి సూచనల మేరకు టన్నెల్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. డిండి ప్రాజెక్టు పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు మెదలుపెట్టామన్నారు. గత సీజన్‌లో 153.58 లక్షల మెట్రిక్ టన్నులు.. ఈ యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని, మొత్తం ఏడాదిలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. పేదల కడుపు నింపేందుకే కాంగ్రెస్ సర్కారు సన్నబియ్యం పంపిణీని చేపట్టిందని చెప్పారు.

**జన్మనిచ్చిన తాటిపాములను మరిచిపోను..**

తనకు జన్మనిచ్చిన గ్రామం తాటిపాములను ఏనాడూ మర్చిపోనని మంత్రి ఉత్తమ్ అన్నారు. తాటిపాములలో రూ.20 కోట్లతో నిర్మించే యశ్వంతాపూర్ వాగుపై చెక్‌డ్యాం, ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. దేవాదుల చివరి ప్యాకేజీ నుంచి చెన్నూరు రిజర్వాయర్ నుంచి తాటిపాముల మీదుగా తిరుమలగిరికి సాగునీటిని తరలిస్తామని ఉత్తమ్ తెలిపారు. తన చిన్నతనంలో ఆ వాగుపై ఆడుకున్నానని గుర్తుచేసుకున్నారు. గ్రామంలో ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి రూ.కోటి, ప్రాథమిక పాఠశాలకు రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, బాలునాయక్, రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భూభారతి రైతులకు రక్షణ కవచం

**నేటి నుంచి మరో 28 మండలాల్లో అమలు**

**కలెక్టర్లు రైతుల సందేహాలను నివృత్తి చేయాలి: పొంగులేటి**



**హైదరాబాద్, మే 4 :** తెలంగాణ భూపరిపాలనలో నూతన అధ్యాయానికి నాంది పలికిన భూభారతి చట్టం రైతులకు రక్షణ కవచమని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత నెల 17 నుంచి 30 వరకు 4 జిల్లాల్లోని 4 మండలాల్లో భూభారతిని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని తెలిపారు. సోమవారం నుంచి 20 వరకు జిల్లాకొక మండలం చొప్పున మిగతా 28 మండలాల్లోనూ ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాకోణంలో తీసుకొచ్చిన ఈ భూభారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారమే సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కలెక్టర్లు జిల్లాల్లో రెవెన్యూ సదస్సులకు హాజరై అక్కడ రైతులు, ప్రజల సందేహాలను నివృత్తి చేసి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తెచ్చిన భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయికి సమ-ర్థంగా తీసుకెళ్లాలని కలెక్టర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# 10 నుంచి మెట్రో చార్జీల పెంపు

**25-30% పెంచేందుకు ఎల్‌అండ్‌టీ నిర్ణయం**

**అనుమతి కోసం 8న సీఎం రేవంత్ రెడ్డితో భేటీ**

**కనిష్ఠంగా రూ.15.. గరిష్ఠంగా రూ.75 వరకు ఉండే చాన్స్**

**హైదరాబాద్ సిటీ, మే 4 :** హైదరాబాద్ నగర రవాణాలో అతి కీలకమైన మెట్రో రైలు టికెట్ చార్జీల పెంపు దాదాపుగా ఖరారైంది. ఛార్జీల పెంపుపై కొంతకాలంగా ఊగిసలాడుతున్న ఎల్ అండ్ టీ అధికారులు నష్టాలను నివారించుకునేందుకు ముందుకుసాగుతున్నారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నియమించిన ఛార్జీల నిర్ణయ కమిటీ (ఎఫ్‌ఎఫ్‌సీ) ఇచ్చిన నివేదిక ఆధారంగా టికెట్ రేట్లు పెంచాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై ఆయన అనుమతి కోరనున్నారు. ఈ అంశం ఇప్పటికే సీఎం దృష్టిలో ఉండడంతో ఆయన సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నారు. ఇదే సమయంలో పెంచనున్న చార్జీలను ఈ నెల 10 నుంచి అమలులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంలో 2012లో రూ.14,132కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మియాపూర్-ఎల్‌బీ నగర్, జేబీఎస్ -ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం మధ్య 69.2 కిలోమీటర్ల పరిధిలో పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం రోజుకు 1,200సర్వీసులు నడుస్తుండగా 4.80 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో 5.10లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు.

**ఏడాదిన్నరగా యత్నాలు**

కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఆదాయం సమకూర్చుకున్న సంస్థ.. తర్వాత నుంచి కుదేలైంది. 2020 నుంచి 2022 వరకు ప్రయాణికుల రాకపోకలు తగ్గడంతో పాటు మాల్స్, ప్రకటనల నుంచి ఆశించిన ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో రవాణా ఆధారిత అభివృద్ధి (టీవోడీ) కింద ప్రభుత్వం ఇచ్చిన 267 ఎకరాల భూమిలో కేవలం నాలుగైదు ప్రాంతాల్లోనే కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మించింది. చాలావరకు భూములు ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం పేరిట మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుండడంతో ఆ భారం కూడా మెట్రోపై పడిందని ఎల్ అండ్ టీ అధికారులు చెబుతూ వస్తున్నారు. అయితే టికెట్ రేట్ల సవరణపై హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్ఎంఆర్), అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తితో కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో ఎఫ్‌ఎఫ్‌సీని నియమించింది. ఆ కమిటీ నగరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కేంద్రానికి నివేదిక సమర్పించింది. 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో ఆ విషయం మరుగునపడింది. అయితే చార్జీల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్‌అండ్‌టీ అధికారు లు ఏడాదిన్నరగా యత్నిస్తున్నారు.



# అత్యంత కఠినంగా నీట్

**విద్యార్థుల్ని బెంబేలెత్తించిన ఫిజిక్స్ ప్రశ్నలు**

**45 ప్రశ్నలకుగాను 25 రాస్తే గొప్పే**

**మిగతా సబ్జెక్టుల్లోనూ కష్టమైన ప్రశ్నలే**

**450 స్కోర్ వస్తే జనరల్ కేటగిరీలో సీటు!**

**గడియారాలు లేక.. సమయం తెలియక ఇబ్బందిపడ్డ విద్యార్థులు.. 95% హాజరు**

**జూన్ 14న ఫలితాలు.. నెలాఖరులోగా కీ**



**హైదరాబాద్, మే 4 :** భౌతిక శాస్త్రంలో 16 ప్రశ్నలు బెంబేలెత్తించాయి! రసాయన శాస్త్రంలో 15 ప్రశ్నలు బెదరగొట్టాయి!! బోటనీలో 14, జువాలజీలో ఆరు ప్రశ్నలు చాలా కష్టంగా వచ్చాయి! ఒక్కమాటలో చెప్పాలంటే.. వైద్య విద్యలో ప్రవేశాల నిమిత్తం ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశ్నపత్రం ఘాటుగా, అత్యంత కఠినంగా ఉంది! రాష్ట్రంలో 190 పరీక్ష కేంద్రాల్లో జరిగిన నీట్ పరీక్షకు 95 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించే సమయంలో అభ్యర్థులను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గడియారాలు, ఇతర గాడ్జెట్లను తీసివేయించారు. ఎప్పటిలాగానే.. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనను కచ్చితంగా అమలు చేశారు. రకరకాల కారణాల వల్ల సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. లోపలికి అనుమతించాలంటూ సిబ్బందిని బతిమిలాడుకున్నా ఉపయోగం లేకపోయింది. దీంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు. కరీంనగర్‌లోని మహిళల డిగ్రీ, పీజీ కాలేజీలో నీట్ పరీక్ష రాసేందుకు ఒక విద్యార్థిని వేములవాడ నుంచి తన తల్లితో కలిసి వచ్చింది. కానీ.. ఆమె మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు.

కూలీ పని చేసి, పుస్తెలతాడు తాకట్టుపెట్టి అప్పు తీసుకొని తన కుమార్తెకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించానని.. ఇలా జరుగుతుందని ఊహించలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరు అయింది. ఇటువంటి ఘటనలు అక్కడక్కడ జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మేడ్చల్ జిల్లా కీసర పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో నీట్ పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థులు.. హాల్ టికెట్‌లో ఆ కేంద్రం పేరు ఒకలా, అక్కడ మరొకలా ఉండడంతో అయోమయానికి గురయ్యారు. అక్కడ గతంలో మూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఉండేది. గత ప్రభుత్వ హయాంలో ఆ కాలేజీని అద్దెకు తీసుకుని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్లలో ఆ కేంద్రం పేరు మూర్తి ఇంజనీరింగ్ కళాశాల అని ఉండడం.. అక్కడ గురుకుల పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. అది తమ పరీక్షా కేంద్రమో కాదో తెలియక అటూ ఇటూ తిరిగి చివరికి అక్కడికి వచ్చేసరికి సమయం మించిపోయింది. దీంతో కొంతమంది విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. ఇక.. కొన్ని పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పా టు చేయలేదు. దీంతో విద్యార్థులు సమయం ఎంత అయిందో తెలియక, పరీక్ష రాయడానికి ఇంకా ఎంత సమయం ఉందో తెలుసుకునే వెసులుబాటు లేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కొన్ని కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులతో దీనిపై గొడవకు దిగారు. కాగా.. హైదరాబాద్ జేఎన్‌టీయూ కేంద్రంలో పరీక్షా సమయం ముగియడానికి ముందే పేపర్లు తీసేసుకున్నారని విద్యార్థులు ఆరోపించారు.

**మునుపెన్నడూ లేనంత..**

నీట్ యూజీ 2018లో మొదలైంది. నాటి నుంచి కిందటి సంవత్సరం దాకా.. ఏ ఏడాదీ నీట్ ప్రశ్నపత్రం ఇంత కఠినంగా లేదని అధ్యాపకులు, విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు తమను బెంబెలెత్తించినట్లు విద్యార్థులు వెల్లడించారు. నీట్ పేపర్‌లో.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలలో మొత్తం 180 ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్‌లో 45 ప్రశ్నలకుగాను 20-25 ప్రశ్నలకు జవాబు రాస్తే చాలా గొప్పేనని నిపుణులు చెబుతున్నారు. మెరిట్ విద్యార్థులు సైతం ఫిజిక్స్‌లో 30ప్రశ్నలకు మించి సమాధానాలు రాయలేకపోయారని.. ఎవరైనా 40ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఆలిండియా ర్యాంకు తథ్యమని వస్తుందని పేర్కొన్నారు. అలాగే, కెమిస్ట్రీలో ఆరు ప్రశ్నలను అత్యంత కఠినంగా ఇచ్చారని, అవి సుదీర్ఘంగా, సమయం ఎక్కువ తీసుకునేలా ఉన్నాయని ఓ ప్రముఖ విద్యా సంస్థలో కెమిస్ట్రీ సీనియర్ ఫ్యాకల్టీగా ఉన్న జె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. బోటనీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని.. కొన్ని ప్రశ్నలు కష్టంగా ఇచ్చారని ఆయ న వెల్లడించారు. అయితే మెజారిటీ విద్యార్థులు ఆ ప్రశ్నలకు బాగానే సమాధానాలు రాసినట్టు చెబుతున్నారు. జువాలజీలో 3-4 ప్రశ్నలు అర్థం కాలేదని కొంతమంది పేర్కొన్నారు. చాలామంది విద్యార్థులు బోర్డు ఎగ్జామ్ సిలబస్‌ను పట్టించుకోలేదని.. వాటిలో ప్రశ్నలు అడగడం లేదన్న ధీమాతో ఉంటున్నారని.. కానీ, ఈసారి వాటి నుంచి కూడా ప్రశ్నలు అడిగారని.. నిపుణులు తెలిపారు. ప్రశ్నపత్రం కఠినంగా రావడంతో విద్యార్థులు ఒకరకమైన బాధతో కనిపించారు. కాగా.. నీట్ ఫలితాలను జూన్ 14న వెల్లడిస్తామని జాతీయ పరీక్షా సంస్థ ప్రకటించింది. ఈ నెలఖారులోగా 'కీ' విడుదలయ్యే అవకాశం ఉంది.

**లాంగ్ టర్మ్ విద్యార్థులకు దెబ్బే..**

తెలంగాణలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని పరీక్ష రాసేవారు 12 నుంచి 15 వేల మంది దాకా ఉంటారు. లాంగ్‌టర్మ్ తీసుకుని నిరుడు పరీక్ష రాసినవారిలో 2వేల మంది వరకూ ఎంబీబీఎస్ సీటు సాధించారని.. ఈసారి మాత్రం ఆ సంఖ్య వెయ్యిలోపే ఉంటుందని నీట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. సాధారణంగా నీట్ లాంగ్‌టర్మ్ విద్యార్థులకు భౌతికశాస్త్రమే ఇబ్బందిగా ఉంటుందని.. ఈ ఏడాది అదే కష్టంగా రావడంతో వారు సీటు కొట్టడం చాలా కష్టమని పేర్కొన్నారు.



# డిగ్రీ పరీక్షలు చేపట్టకపోవడం ప్రభుత్వ అసమర్థత

**రేవంత్‌వి గాలి మాటలు: హరీశ్‌రావు**

**హైదరాబాద్, మే 4 :** రాష్ట్రంలోని కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల పరిధిలో ఏప్రిల్‌లో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను నేటికీ చేపట్టకపోవడం ప్రభుత్వ అసమ-ర్థతేనని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించరా? అని ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఇంకా మెరుగైన రీతిలో కొనసాగిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ పథకాన్ని మరుగునపడేలా చేసిందన్నారు.

విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని అసెంబ్లీలో చెప్పిన మాటలు గాలి మాటలయ్యాయని విమర్శించారు. రెండు నెలల్లో మొత్తం బకాయిలు చెల్లిస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నీటిమూటగా మారిందన్నారు. పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. సకాలంలో పరీక్ష నిర్వహించక పోవడంతో పీజీసెట్, లాసెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారన్నారు.

# కర్రెగుట్టల్లో దొరకని నక్సల్స్ ఆచూకీ

**రెండో రోజే తప్పించుకున్న మావోయిస్టులు?**
**ఇంకా 30కి పైగా గుట్టల్లో గాలింపు పెండింగ్**
**ప్రతికూల వాతావరణంలో చతికిలపడిపోతున్న పారామిలిటరీ బలగాలు.. పలువురికి డీహైడ్రేషన్**
**3 వేల మందికి పైగా నక్సల్స్ ఉన్నారని తొలుత ప్రచారం.. ఇప్పటికి ఆరుగురి ఎన్‌కౌంటర్**



**హైదరాబాద్, మే 4:** తొలుత 'బచావో కర్రెగుట్టలు'.. ఆ తర్వాత 'ఆపరేషన్ కర్రెగుట్టలు'.. పేరు ఏదైనా కేంద్ర బలగాలు ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులను గుర్తించలేకపోయారా? 3 వేల మందికిపైగా నక్సల్స్ ఉన్నారంటూ.. విడతల వారీగా 24 వేల బలగాలను మోహరించిన పోలీసులు.. ఆరుగురు పీఎల్‌జీఏ సభ్యుల ఎన్‌కౌంటర్ మినహా.. పెద్దగా పురోగతి సాధించలేదా? అత్యంత క్లిష్టమైన గుట్టల్లోంచి మావోయిస్టులు మహారాష్ట్ర, తెలంగాణ వైపు తప్పించుకున్నారా? ఈ ప్రశ్నలకు మాజీ పోలీసులు, నిఘా సంస్థల నుంచి అవుననే సమాధానం వస్తోంది. నక్సల్స్ గుట్టలపై ఉన్నప్పుడు అనుసరించాల్సిన యుద్ధ వ్యూహాలను(జంగిల్ వార్‌ఫేర్) కేంద్ర బలగాలు ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగడంతో ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి. 'ఆపరేషన్ కర్రెగుట్టలు'లో కేవలం ఛత్తీస్‌గఢ్ పోలీసులు డీఆర్జీ, ఎస్టీఎఫ్, కేంద్ర బలగాలు సీఆర్పీఎఫ్, కోబ్రా మాత్రమే పాల్గొన్నాయి. నిజానికి తెలంగాణలో 90 కిలోమీటర్ల పొడవునా ఈ గుట్టలున్నాయి. దాదాపు సగం గుట్టలు తెలంగాణ పరిధిలో ఉన్నాయి. అటు మహారాష్ట్రలోనూ ఇంద్రావతి నది వైపు గుట్టలు విస్తరించి ఉన్నాయి. మొత్తం 288 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ గుట్టలపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర బలగాలకు పెద్దగా అవగాహన లేదు. తెలంగాణ పోలీసులు పలు మార్లు ఇక్కడ ఆపరేషన్లు నిర్వహించారు.

అటు ఇంద్రావతి ప్రాంతంపై మహారాష్ట్ర పోలీసులకు మంచి పట్టు ఉంది. అయితే.. ఎన్‌కౌంటర్ల చరిత్రలోనే తెలంగాణ గ్రేహౌండ్స్ సహకారం లేకుండా ఇటీవల అతిపెద్ద ఆపరేషన్లను ఛత్తీస్‌గఢ్ పోలీసులు నిర్వహించారు. కాంకేర్ జిల్లా పరిధిలోని అబూజ్‌మఢ్‌లో 26 మంది నక్సల్స్, ఛత్తీస్‌గఢ్ -ఒడిసా సరిహద్దుల్లోని గరియాబంద్-కుల్హారిఘాట్ అడవుల్లో 16 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ పోలీసులు కేంద్ర బలగాల సహకారంతో ఒంటరిపోరును ప్రారంభించారు. కర్రెగుట్టల్లోనూ అదే వ్యూహాన్ని అనుసరించారు. 'ఆపరేషన్ కగార్'లో తమకే క్రెడిట్ దక్కాలని అలా చేసి ఉండవచ్చని విశ్రాంత పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు. కర్రెగుట్టల చుట్టూ 6 వేల బలగాలతో మొదలుకుని, విడతల వారీగా 24 వేల మంది పోలీసులను మోహరించారు. అయితే.. కర్రెగుట్టలపై అవగాహన లేక.. అక్కడి ప్రతికూల వాతావరణంలో నిలదొక్కుకోలేక.. అగ్రనాయకులు, సెంట్రల్ కమిటీ సభ్యులు, పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్ కమాండర్ హిడ్మా టార్గెట్‌గా చేపట్టిన ఆపరేషన్‌లో పెద్దగా సఫలమవ్వలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద నాయకులెవరూ దొరకకున్నా.. హిడ్మా బెటాలియన్‌కు చెందిన ముగ్గురు మహిళా నక్సల్స్ సహా.. ఆరుగురు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. మిగతా నక్సలైట్లంతా తప్పించుకుని ఉంటారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌లో తెలంగాణ, మహారాష్ట్ర పోలీసుల సహకారం తీసుకుని ఉంటే.. పరిస్థితి వేరేలా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**టెక్నాలజీ ఉన్నా..**

'ఆపరేషన్ కర్రెగుట్టలు'లో కేంద్ర బలగాలు భారీ టెక్నాలజీని వినియోగించాయి. డ్రోన్లు, హెలికాప్టర్ల సేవలను వాడుకున్నాయి. థర్మల్ ఇమేజ్‌తో జాడను గుర్తించే సాంకేతికతను రంగంలోకి దింపాయి. కర్రెగుట్టల ను చుట్టుముట్టినా.. నక్సల్స్ తప్పించుకోవడానికి అవకాశం ఎలా చిక్కిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఎత్తయిన ప్రాంతాల్లో బలగాలు అనుసరించాల్సిన వ్యూహాలను పూర్తిగా విస్మరించాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "కొండలపై కలుగుల్లో/గుహల్లో ఉన్న నక్సల్స్‌ను వ్యూహాత్మకంగా కట్టడి చేయాలి. తొలుత కొండల చుట్టూ ఉచ్చుపన్ని.. ఆ తర్వాత కలుగుల్లోంచి బయటకు వచ్చేలా చేయాలి. జంగిల్ వార్‌ఫేర్‌లో ప్రాథమిక సూత్రం ఇది. కర్రెగుట్టలో ఈ వ్యూహం అమలు కాకపోవడం పెద్ద లోటు. గుట్టల మధ్య ఎండాకాలం కొలిమిని తలపించేలా వేడి ఉంటుంది. సాయంత్రం 4 దాటితే.. ముందు నడిచి వెళ్లేవారు కూడా కనిపించనంతగా చిమ్మచీకటి ఉంటుంది. ఇలాంటి ప్రతికూల వాతావరణం ఉండే చోట స్థానిక పోలీసుల సహకారం తీసుకుని ఉండాల్సింది" అని పలు నక్సల్స్ ఆపరేషన్లలో పాలు పంచుకున్న ఓ విశ్రాంత పోలీసు అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. స్థానిక పోలీసులకు మావోయిస్టుల కదలికలపై సమాచారం అందించే ఇన్ఫార్మర్లు ఉంటారని ఆయన వివరించారు. కానీ, ఆపరేషన్‌లో తాము పాల్గొనడం లేదంటూ తెలంగాణ పోలీసులు బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు.

**బలగాలు సాధించిందేమిటి?**

'ఆపరేషన్ కర్రెగుట్టలు' ప్రారంభమైన తర్వాత.. ఆరుగురు నక్సల్స్ ఎన్‌కౌంటర్, వెయ్యి మంది మావోయిస్టులు తలదాచుకునే భారీ గుహను గుర్తించడం మినహా.. పెద్దగా సాధించిందేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డ్రోన్లు, హెలికాప్టర్లు, కే9, కే3 డాగ్‌స్క్వాడ్స్ సహాయంతో కర్రెగుట్టల్లోకి బలగాలు వెళ్లగలిగాయి. పదుల సంఖ్యలో మావోయిస్టుల భూగర్భ బంకర్లను గుర్తించి, ప్రెషర్‌కుక్కర్, టిఫిన్, పైపు, బీర్‌బాటిల్ బాంబులను స్వాధీనం చేసుకున్నాయి. నీలం కొండ(సరాయ్), దోబే కొండలు, ఆలుబాకల్లో మూడు బేస్ క్యాంపులను ఏర్పాటు చేశాయి. అయితే.. ఇంకా గాలించాల్సిన కొండలు 30కి పైగానే ఉన్నట్లు సమాచారం. 3 వేల మందికి పైగా నక్సలైట్లు, కేంద్ర కమిటీ నాయకులు కర్రెగుట్టల్లో ఉన్నారని బలగాలు భావించినా.. వారి జాడను గుర్తించలేకపోయాయి. ప్రతికూల వాతావరణంతో 15 మంది జవాన్లు వడదెబ్బ బారినపడ్డారు. వంద మందికి పైగా డీ-హైడ్రేషన్‌కు గురయ్యారు. అయితే.. మావోయిస్టులను వారి సేఫ్‌జోన్ నుంచి తరిమేశారనే క్రెడిట్ బలగాలకు దక్కే అవకాశాలున్నాయని విశ్రాంత పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## యాదగిరిక్షేత్రంలో భక్తుల సందడి

**యాదగిరిగుట్ట, మే 4 :** వరుసగా వెలువడిన పరీక్షా ఫలితాలు.. వేసవి సెలవులు.. వారాంతం కలిసి రావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం భక్తజనసంద్రమైంది. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోగా వైకుంఠద్వారం ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేశారు. సుమారు 46 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ఉచిత ధర్మదర్శన క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనాలకు 3 గంటల సమయం పట్టింది. మరోవైపు శని, ఆదివారాల్లో ప్రముఖులకే ప్రోటోకాల్ దర్శనాలుంటాయని ఈవో వెంకట్రావు తెలిపారు.



## నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, మే 4 :** రాష్ట్ర రైతాంగానికి సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పనకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే నూతన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 5 నుంచి జూన్ 13 వరకు సుమారు 1200 గ్రామాలలో నిర్వహిస్తామన్నారు. సుమారు 200లకు పైగా శాస్త్రవేత్తలతో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. దక్షిణ తెలంగాణ మండలాల్లో సుమారు 100 బృందాలు, ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 బృందాలు పాల్గొంటాయన్నారు.



ఒక్కో బృందం రోజూవారి కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక చేసుకున్న గ్రామాల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. యూరియా వాడకం తగ్గింపు, జాగ్రత్తగా రసాయనాల వాడకం, రశీదులను భద్రపరచడం, సాగు నీటి ఆదా, పంటల మార్పిడి, చెట్లను పెంపకంపై అవగాహన కల్పిస్తారన్నారు. వీటితోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు సూచనలు, సలహాలందిస్తారని తెలిపారు. రైతులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని, వ్యవసాయ సంబంధిత అంశాలపై అనుమానాలను శాస్త్రవేత్తల ద్వారా నివృత్తి చేసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లాలోని ధరూర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

## సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదు

**బిల్లుల ఆమోదంపై కాలపరిమితి సబబే: జస్టిస్ కేఎం జోసెఫ్**

కోచి, మే 4: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై సంతకాలు చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సబబేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ అన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి నిర్ణయం అవసరమని తెలిపారు. కోచిలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'గవర్నర్ల అధికారాల్లో న్యాయ వ్యవస్థ' పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బిల్లుల ఆమోదంలో గవర్నర్ల పాత్ర పరిమితంగా ఉంటుందని తెలిపారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఇదిలా ఉండగా, అరెస్టులు, ఆస్తుల జప్తు విషయమై ఈడీకి ఉన్న అధికారాలను సమర్థిస్తూ 2022లో ఇచ్చిన తీర్పు సమీక్షించాలా.. వద్దా అన్నదానిపై నిర్ణయించేందుకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.

## పాక్‌పై జలఖడ్గం

**బాగ్లిహార్ డ్యాం నుంచి నీళ్ల నిలిపివేత**

**న్యూఢిల్లీ, మే 4:** పాకిస్థాన్‌పై భారత్ జలఖడ్గాన్ని ప్రయోగించింది. జమ్మూకశ్మీరులోని రాంబాణ్ జిల్లాలో బాగ్లిహార్ డ్యాం నుంచి చీనాబ్ నదీ జలాల విడుదలను నిలిపివేసింది. జీలం నదిపై నిర్మించిన కిషన్‌గంగా డ్యాం నుంచి కూడా నీటి విడుదలను ఆపేయాలని యోచిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ రెండూ హైడ్రో-ఎలక్ట్రిక్ డ్యాంలు. అవసరమైనప్పుడు నీటి విడుదలను నియంత్రించేందుకు భారత్‌కు ఇవి వీలు కల్పిస్తున్నాయి. ప్రధానంగా బాగ్లిహార్ డ్యాంపై ఇరు దేశాల మధ్య మొదటి నుంచీ వివాదం ఉంది. దీని పరిష్కారానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వాన్ని కూడా పాక్ గతంలో కోరింది. జీలం నదికి ఉపనది అయిన నీలం నదిపై కిషన్‌గంగా డ్యాం నిర్మించారు. ఈ మూడు నదులూ పాక్‌కు జీవనాడి వంటివి. సాగునీటికే కాదు.. తాగునీటికి కూడా ఇవే ఆధారం. దీంతో ఆ దేశం విలవిలలాడుతోంది. భారత్‌ను ఎలా ఎదుర్కోవాలో అర్థం గాక పాక్ మంత్రులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. భారత్‌పై అణుదాడి చేస్తామని బెదిరిస్తున్నారు. పాక్‌కు ప్రవహించే నదులపై ఇండియా ఎలాంటి కట్టడాలు కట్టినా ధ్వంసం చేస్తామని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ శనివారం హెచ్చరించారు.

## 16న అమెరికాకు ఎమ్మెల్సీ కవిత

**అనుమతినిచ్చినసీబీఐ కోర్టు**



**హైదరాబాద్, మే 4 :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 16న అమెరికాకు వెళ్లనున్నారు. కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు భర్త అనిల్‌తో కలిసి కవిత అమెరికా వెళ్తున్నట్లు ఎమ్మెల్సీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈనెల 16 నుంచి 22 వరకు కవిత అక్కడే ఉంటారని.. 23న తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. ఈమేరకు ఆమె పర్యటనకు ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపింది.

## ప్రేమ జంట ఆత్మహత్య..

**రాజాపూర్, మే 4 :** మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరేవల్లి గ్రామంలో ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరూ మైనర్లేనని ఎస్ఐ శివానందం తెలిపారు. చిన్న రేవల్లికి చెందిన యువకుడు(17), అతడి కంటే 6 నెలలు పెద్దదైన యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి వయసు వచ్చి, ఆర్థికంగా స్థిరపడిన తరువాత పెళ్లి చేస్తామని కుటుంబసభ్యులు, గ్రామస్థులు వారికి నచ్చచెప్పారు. అయితే ఆదివారం యువతి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న యువకుడు మొదంపల్లి గ్రామ శివారులోని పశువుల కొట్టంలో ఉరేసుకున్నాడు.

## రెండు కార్లపై కట్టెల లోడ్ లారీ బోల్తా

**ఇద్దరికి గాయాలు, త్రుటిలో తప్పించుకున్న ముగ్గురు**
**బాధితులకు హరీశ్ రావు సాయం**

**కొండాపూర్, మే 4 :** కట్టెల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ రెండు కార్లపై బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, ముగ్గురు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ సమీపంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగింది. ఈ ప్రమాదంలో ఓ కారులో ప్రయాణిస్తున్న రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లికి చెందిన అరుణకు గాయాలు కాగా, ఆమె భర్త, ఇద్దరు కుమారులు త్రుటిలో తప్పించుకున్నారు.

మరో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో జహీరాబాద్ వెళ్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు తన కాన్వాయ్ ఆపి సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు, సిబ్బందితో కలిసి కార్లలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. గాయపడిన ఇద్దరిని తన వాహనంలో ఎక్కించి ఆస్పత్రికి పంపించారు. ఎస్పీ, కలెక్టర్‌తో మాట్లాడి బాధితుల వైద్యానికి సాయం అందించాలని హరీశ్ రావు సూచించారు.





# మహిళలు పట్టుదలతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి..

**అవకాశాలను అందిపుచ్చుకోవాలి**

**అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలవాలి..**

**గ్రామాల్లో సమస్యల పరిష్కరానికి ప్రత్యేక కృషి..**

**లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలి..**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, జనతా న్యూస్: సహనానికి.. ఓర్పుకు మహిళలు మారుపేరూ అని, క్రమశిక్షణ పట్టుదల కృషి కటోర శ్రమతో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. డెమొక్రటిక్ సంఘ సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని బొమ్మకల్ బైపాస్ రోడ్ లో ఉన్న వీ కన్వెన్షన్ హాల్ లో ఆదివారం గ్రామీణ మహిళ నాయకత్వ కార్యక్రమం కింద మహిళా సంఘం వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రముఖ నటి డెమోక్రటిక్ సంఘ సహ వ్యవస్థాపకురాలు రెజీనా కాసాంద్రా, సంస్థ వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త ఎంఆర్ఎస్కే చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడారు. మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న మహిళలు సమస్యలపై చక్కగా మాట్లాడాలని, వారు చెప్పిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలనీ, అప్పుడే నాయకులుగా రాణిస్తారని తెలిపారు. లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా గ్రామాల్లో అనాధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో ఆర్టీసీ బస్సుల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని, విద్యార్థులు మహిళలు వృద్ధుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కోతులు, కుక్కలకు మానవులతో అనుబంధం ఎక్కువగా ఉంటుందని వాటిపై దాడులు చేయకుండా సంరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలోని మహిళా మణులు అందరూ మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు మరింత చైతన్యవంతులు కావాలని, పురుషుల ప్రోత్సాహం లేకుండానే అన్ని రంగాల్లో ముందుకెళ్లేలా కృషి చేయాలని, ఆ దిశగా ప్రస్తుతం ముందడుగు పడుతున్నదని పేర్కొన్నారు. మహిళలు చైతన్యవంతులైనప్పుడే సమాజం చైతన్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం మహిళలు కృషి చేయాలని, ప్రైవేట్ పాఠశాలల పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలను ఆదరించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను, మహిళా నాయకత్వాన్ని పెంపొందించడానికి లాభాపేక్షలేకుండా డెమోక్రటిక్ సంఘ సంస్థ కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆ సంస్థ గ్రామాల్లో మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తూ మహిళల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయడం శుభ పరిణామమని తెలిపారు. డెమొక్రటిక్ సంఘ సంస్థ ఏర్పాటు చేసిన మహిళా సంఘాలకు సైతం ప్రభుత్వం తరఫున తోడ్పాటు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వీరికి సైతం స్కూల్ యూనిఫామ్ లు కుట్టే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

ప్రముఖ నటి డెమోక్రటిక్ డెమొక్రటిక్ సంఘ సహ వ్యవస్థాపకురాలు రెజీనా కాసాంద్రా, సంస్థ వ్యవస్థాపకుడు ఎంఆర్ఎస్కే చైతన్య మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు అంటే స్టేజి మీద మాట్లాడం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో అన్యాయాన్ని ఎదిరించడం తోపాటు సమస్యలపై గల మెత్తడమే లక్ష్యంగా మహిళలు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. తమ సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని వారిలో చైతన్య నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాల రూపొందిస్తున్నామని తెలిపారు. మహిళలకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే దిశగా తమ సంస్థ ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. మహిళ నాయకత్వం మార్పుకు మార్గదర్శనమని పేర్కొన్నారు. మహిళలందరికీ రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను తెలపడంతో పాటు వారినీ అన్ని రంగాల్లో నిష్ణాతులను చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన దాదాపు 25 మంది మహిళా సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలు పలు అంశాలపై మాట్లాడారు. మహిళలు విన్నవించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు సంస్థ ఫౌండర్ చైతన్య సినీనటి రెజీనా కసాంద్రా తదితరులు జిల్లా కలెక్టర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో డెమోక్రటిక్ సంఘ ట్రస్ట్ ప్రియ రాజీవ్, ప్రతినిధి షేక్ ఆయుబ్ అడిషనల్ డి ఆర్ డిఓ సునీత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లు లేని నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

**పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపిక**

**ఇందిరమ్మ ఇల్ల ఎంపిక లో రాజకీయ జోక్యం లేదు**

**అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక చేస్తే చర్యలు -**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

కరీంనగర్, జనతా న్యూస్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్లు ..ఇల్లు లేని నిరుపేదలకు అర్హులుగా ఎంపిక చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొదటి విడత ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎవరైనా అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక లో అవినీతి ఆస్కారం జరిగి అనర్హుల ఎంపిక చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తరువాత ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుల ఎంపిక జరగాలని పేర్కొన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పేర్లను గ్రామాల్లో డిస్ ప్లే చేయాలని ఆదేశించారు. గత పది సంవత్సరాల్లో ఏ గ్రామానికి డబుల్ బెడ్ రూమ్ రాలేదని, ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు ప్రతి గ్రామానికి వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇళ్లు రాని వారు నిరాశపడాల్సిన అవసరం లేదని రెండు నెలల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక లో గ్రామాల్లో సయోధ్య లేక ఇబ్బందులు పడవద్దని గ్రామాల్లో అందరూ కూర్చొని అర్హతలో అతిపెదవాడికి ఇల్లు రావాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# "ధ్వజస్తంభ ప్రతిష్టకు రండి"

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఆహ్వానం

హుజురాబాద్ మే 4 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈనెల 23న జరిగే ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని కరీంనగర్లో కలిసి ఆహ్వానాన్ని అందించారు. బిజెపి సీనియర్ నేత గంగిశెట్టి రాజు, ఆలయ చైర్మన్ క్యాస చక్రధర్, ఆలయ అర్చకులు చెరకుపల్లి శ్రీధరాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు అరుణ్, శ్రావణ్ తదితరులు బండి సంజయ్ ని కలిశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆలయానికి ధ్వజస్తంభాన్ని పునః ప్రతిష్టించడం సంతోషంగా ఉందని బండి ప్రశంసించారు. తప్పకుండా కార్యక్రమానికి హాజరవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.



# 52 సంవత్సరాల తర్వాత ధర్మశాల పునర్నిర్మాణానికి ముందుకొచ్చిన భక్తుడు

**దాత కుటుంబాన్ని ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్**



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో గత 52 సంవత్సరాల క్రితం ధర్మశాలను నిర్మించగా, అనివార్య కారణాల వలన అర్ధాంతరంగా ఆగిపోయిన ధర్మశాల ను పునర్నిర్మిం చడానికి సోలాపూ ర్‌లో సెట్ అయినటువంటి బెజ్జంకి వాస్తవ్యులు ఉడ్నాల హనుమంతు మల్లవ్వ దంపతులు కుటుంబ సమేతంగా ఆదివారం ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆగిపోయిన ధర్మశాల పునర్నిర్మాణం 3లక్షల ఖర్చుతో ప్రస్తుత ఆలయ కమిటీ సహకారంతో పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. గతంలో ధర్మశాల నిర్మాణం ఆగిపోయిన, సోలాపూర్ లో సెట్ అయినప్పటికీ తన మనసంతా లక్ష్మీ నరసింహ స్వామి పై ఉందని, ఇన్ని సంవత్సరాలకు స్వామి వారి కటాక్షంతో ఎలాంటి అవాంతరాలు లేకుండా ధర్మశాల నిర్మాణం జరగాలని స్వామివారిని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు మధుసూదనా ఆచార్యులు హనుమంతు కుటుంబాన్ని స్వామివారి తీర్థప్రసాదాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, ఆలయ పూజారి, మరియు ఐలేని జయ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ సిబ్బంది ప్రవీణ్, కనకయ్య, హరీష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకే రక్షణ లేదు మరి మనుషుల పరిస్థితి ఏంటి?

**ఏఎంసి మాజీ డైరెక్టర్ దీటి రాజు.**

**ఇథనాల్ ఫ్యాక్టరీ ఇతర రాష్ట్రాల కార్మికుల దుశ్చర్య.**

**వ్యవసాయ పనులకు పోవాలంటే జంకుతున్న మహిళలు.**

**సెటిల్ కోసం ప్రయత్నిస్తున్న యాజమాన్యం, కేసు జాప్యం చేస్తున్న పోలీసు యంత్రాంగం.**



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని నరసింహులపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇథనల్ ఫ్యాక్టరీ సమీపంలో గల పశువుల పాకలో పశువులపై లైంగిక దాడి హేయమైన చర్య , ఈ ఫ్యాక్టరీ వలన పశువులకే రక్షణ లేదు, మరి మనుషుల పరిస్థితి ఏంటని, ఆ దృశ్చర్యకు పాల్పడ్డ దుర్మార్గులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని పోలీస్ అధికారులను ఏఎంసి మాజీ డైరెక్టర్ దీటి రాజు ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు ఈ ఘాతుకానికి పాల్పడగా, అట్టి విషయాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యం డబ్బుతో సెటిల్ చేయాలని చూడడం, పశువులకు ట్రీట్మెంట్ ఇప్పిస్తామని కేసులు వద్దని బేరాలు చేయడం , ఇట్టి విషయంలో పోలీసులు చూస్తూ ఊరుకోవడం, కేసు నమోదు చేయడంలో జాప్యం చేయడం విడ్డూరమని విమర్శించారు. ఈ ఘటనతో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఎల్లమ్మ గుడికి మైక్ సెట్ వితరణ

**మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్ కు ధన్యవాదాలు తెలిపిన బేగంపేట గౌడ సంఘం**




జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని బేగంపేట గ్రామ గౌడ కులస్తుల కోరిక మేరకు మాజీ ఎంపీపీ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్ రేణుక ఎల్లమ్మ గుడికి మైక్ సెట్ వితరణ చేయగా, అట్టి మైక్ సెట్ ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుండా అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి లు గౌడ కులస్తులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా గౌడ కులస్తులు రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు కాంగ్రెస్ నాయకులపై ఉండాలని కోరుకుంటూ, సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# "గుండేడు"కు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి రూ.10 లక్షల విరాళం

**గ్రామస్తుల హర్షం**

హుజురాబాద్ మే 4 జనతా న్యూస్: కమలాపూర్ మండలంలోని గుండేడుకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదివారం రూ. 10 లక్షల విరాళం అందజేశారు. గ్రామ ప్రజలు, నాయకులు, అన్ని కులాల పెద్దలు పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి, తమ గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయగా ఆయన వెంటనే స్పందించారు. గ్రామ అభివృద్ధి పట్ల తన అనురాగాన్ని చాటుతూ రూ. 10 లక్షల విరాళాన్ని ప్రకటించి, గ్రామస్థుల సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రజల అభివృద్ధే తనకు ప్రథమ ప్రాముఖ్యత అనిఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు, పెద్దలు ఆయనను ఘనంగా సన్మానిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# ఇకపై రైతులందరికీ ఫార్మర్ ఐడి

**హుజురాబాద్ అగ్రికల్చర్ ఏ డి సునీత**



హుజురాబాద్ మే 4 జనతా న్యూస్: వ్యవసాయ రంగాన్ని ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యునిక్ ఐ.డి.) ఆధార్ కార్డ్ తరహాలో రైతులకు అందించనున్నట్లు హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వ్యవసాయ భూమి కలిగిన రైతులు పి.యం. కిసాన్ సమ్మాన్ నిధి, వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. మే 5 నుండి గ్రామాల వారిగా వ్యవసాయ విస్తరణ అధికారులచే గ్రామాల్లో నమోదు పక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరములతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ ఐడి నమోదు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రుణ మాఫీ తదితర రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ ఐడీకి ఎలాంటి సంబంధం లేదని, రైతు విశిష్ట సంఖ్య(ఫార్మర్ ఐ.డి)ను పొందుటకు రైతు యొక్క ఆధార్, పాస్ పుస్తకం, అధార్ లింక్ కలిగిన మొబైల్ నెంబర్ తీసుకొని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని లేదా సమీప మీ-సేవలో సంప్రదించి ఫార్మర్ ఐ.డీ కి నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

# మోడల్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం. వనజ ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మోడల్ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూప్ లలో సీట్ల కోసం పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఆన్లైన్ లో http//183.82.87.97./mstg వెబ్ సైట్ లో 5 మే 2025 నుండి 20 మే 2025లోపు ఆన్ లైన్ లో అప్లై చేసుకోవాలని సూచించారు. 22 మే 2025 రోజున దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ప్రకటించబడుతాయని తెలిపారు. 26 మే 2025 రోజున మెరిట్, రిజర్వేషన్ ల వారీగా విద్యార్థులు ఏ గ్రూప్ లో సెలెక్ట్ అయ్యారో ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు

27 మే 2025 నుండి 31 మే 2025 లోపు ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. 02 జూన్ 2025 నుండి తిమ్మాపూర్ మోడల్ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ ఎం వనజ పేర్కొన్నారు.

# నీట్ పరీక్ష ప్రశాంతం..

**పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాం..**
**2914 మంది విద్యార్థుల హాజరు..**
**61 మంది విద్యార్థులు గైర్హాజర్..**
**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**
**జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్**
**నీట్ పరీక్ష కేంద్రాల సందర్శన**



కరీంనగర్ , జనతా న్యూస్: జిల్లాలో నీట్ పరీక్ష ప్రశాంతం గా నిర్వహించామని, ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు.

ఆదివారం కరీంనగర్ బైపాస్ రోడ్ లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ, ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో నీటి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు ఆయా చోట్ల ఎంత మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.. ఏర్పాట్లు పకడ్బందీగా చేశారా.. ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా... పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారా... అని అధికారుల నుంచి కలెక్టర్ వివరాలు సేకరించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ చేపట్టిన ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గదుల్లోకి వెళ్లి పరీక్ష తీరు.. వసతుల కల్పనను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 2975 మందికి 2914 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారని, 61 మంది విద్యార్థులు హాజరు కాలేదని పేర్కొన్నారు. నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఈ మేరకు పకడ్బందీ చర్యలు చేపట్టామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష జరిగిందని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. కలెక్టర్ వెంట నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, ఎస్ ఆర్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తహసిల్దార్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

**అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలన ..**

అదేవిధంగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ నీట్ పరీక్ష కేంద్రాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా వసతుల కల్పన.. విద్యార్థుల హాజరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. అన్ని వివరాలను తెలుసుకున్నారు. పోలీసుల భద్రత..విద్యార్థుల బయోమెట్రిక్, తనిఖీలు.. వివిధ అంశాలను కనుక్కున్నారు. ఎక్కడా ఏలాంటి తప్పిదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు అడిషనల్ కలెక్టర్ సూచించారు. నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా సాగిందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు.

# లెమన్ జ్యూస్ చేస్తున్నారా..

## వేసవిలో ఈ పొరపాట్లు చేస్తే రుచిలో తేడా..



వేసవిలో నింబూ షర్బత్ లేదా లెమన్ జ్యూస్ తాగితే శరీరం తక్షణ శక్తిని పొందుతుంది. దాహం తీరడంతో పాటు వేసవి తాపానికి గురైన శరీరమూ చల్లబడుతుంది. వేగంగా హైడ్రేట్ అవుతారు. నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. కానీ నిమ్మరసం తయారుచేసేటప్పుడు కొన్ని సాధారణ తప్పులు చేస్తే అది రుచికరంగా ఉండదు. అలాగే ఆరోగ్యానికి ఏ ప్రయోజనం దక్కదు. కాబట్టి, నిమ్మరసం తయారుచేసేటప్పుడు నివారించాల్సిన 5 తప్పుల గురించి తెలుసుకుందాం.

**నిమ్మరసం ఎక్కువగా కలపడం**

చాలా మంది నిమ్మకాయ ఎక్కువగా వేసుకుంటే షర్బత్ పుల్లగా, రుచిగా మారుతుందని నమ్ముతారు. కానీ వాస్తవానికి అది షర్బత్ రుచిని పాడు చేసి కడుపులో చికాకు కలిగిస్తుంది. ఒక గ్లాసు నిమ్మరసానికి సగం లేదా ఒక నిమ్మకాయ రసం సరిపోతుంది.

**గోరువెచ్చని లేదా వేడి నీరు**

నిమ్మరసాన్ని ఎల్లప్పుడూ చల్లని లేదా సాధారణ ఉష్ణోగ్రత కలిగిన నీటితోనే తయారు చేయాలి. వేడి నీటిలో నిమ్మరసం కలపడం వల్ల దాని పోషక విలువలు తగ్గుతాయి. రుచి కూడా చెడిపోతుంది.

**చక్కెర సమతుల్యత**

చాలా తక్కువ లేదా ఎక్కువ చక్కెర జోడించడం వల్ల నిమ్మరసం రుచి చెడిపోతుంది. డయాబెటిస్ బాధితులు అయితే తక్కువ చక్కెర తీసుకునే బదులు తేనె లేదా బెల్లం ఉపయోగించవచ్చు. కానీ తగిన పరిమాణాన్ని గుర్తుంచుకోండి.

**ఉప్పు, నల్ల ఉప్పు మధ్య తేడా**

నిమ్మరసంలో సాధారణ ఉప్పుకు బదులుగా నల్ల ఉప్పును జోడించడం వల్ల ఎక్కువ ప్రయోజనకరంగా, రుచికరంగా ఉంటుంది. నల్ల ఉప్పు జీర్ణక్రియకు సహాయపడుతుంది. అలాగే నిమ్మరసానికి భిన్నమైన రుచిని ఇస్తుంది.

**నిమ్మకాయను ముందుగా కోయండి**

సమయం ఆదా అవుతుందని చాలామంది నిమ్మకాయను ముందుగానే కోసి ఫ్రిజ్‌లో ఉంచుతారు. కానీ ఇలా చేయడం వల్ల నిమ్మరసం వాతావరణంలోని ఆక్సిజన్‌తో చర్యజరిపి తాజాదనాన్ని కోల్పోతుంది. అందుకే ఎల్లప్పుడూ షర్బత్‌లో తాజా నిమ్మకాయనే కోసి వాడండి

# యావత్ దేశమంతా గల్లా ఎగరేసుకునేలా మోదీ చర్యలుండబోతున్నాయ్

**అతి త్వరలో యావత్ ప్రపంచం మోదీ తెగువ, పట్టుదలను చూడబోతోంది**
**పెహల్ గాం ఘటనతో దేశ ప్రజలంతా ఆవేశంతో రగిలిపోతున్నారు**
**హిందువుల సత్తా చాటేలా ఈనెల 22న కరీంనగర్ "హిందూ ఏక్తా యాత్ర"**
**తెలంగాణవ్యాప్తంగా జరగబోయే ఏక్తా యాత్రలకు స్ఫూర్తిగా నిలుద్దాం**
**లక్ష మందితో కరీంనగర్ లో హిందు ఏక్తా యాత్ర నిర్వహిస్తాం**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు**
**కరీంనగర్ లో బీజేపీ నాయకులతో కలిసి 'హిందూ ఏక్తా యాత్ర' సన్నాహక సమావేశం నిర్వహించిన బండి సంజయ్**




**కరీంనగర్, జనతా న్యూస్:** పెహల్ గాం" ఘటనతో దేశ ప్రజలంతా ఆవేశంతో రగిలిపోతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో యావత్ దేశ ప్రజలంతా గల్లా ఎగరేసుకునేలా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరు విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉన్న కమిట్ మెంట్, తెగువ, ధైర్య సాహసాలు అతి త్వరలోనే యావత్ ప్రపంచం చూడబోతోందన్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రజలంతా ఐక్యత చాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందులో భాగంగా హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 22న కరీంనగర్ లో కనీవినీ ఎరగని రీతిలో 'హిందూ ఏక్తా యాత్ర'ను నిర్వహించబోతున్నామని ప్రకటించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఒక్క హిందువు ఈ యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణవ్యాప్తంగా భవిష్యత్తులో జరగబోయే హిందూ ఏక్తా యాత్రలకు కరీంనగర్ స్ఫూర్తిగా నిలవబోతోందన్నారు.

ఆదివారం కరీంనగర్ రేకుర్తిలోని మహాలక్ష్మీ గార్డెన్ లో హిందూ ఏక్తా యాత్ర ఏర్పాట్లపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బండి సంజయ్ తోపాటు కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, నగర మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వందలాది మంది బీజేపీ నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగించారు.

ప్రతి ఏటా కరీంనగర్ లో నిర్వహించే హిందూ ఏక్తా యాత్ర కోసం ప్రపంచంలోని హిందువులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు.. విదేశాల్లో ఉండే హిందువులు సైతం ఆరోజు యాత్రలో పాల్గొని హిందువుల ఐక్యతను చాటి చెబుతారు. హిందూ ఏక్తా యాత్ర తరువాత కరీంనగర్ లో చాలా మేరకు బలవంతపు మతమార్పిడులు, లవ్ జిహాదీలు ఆగిపోయాయి. అయితే పెహల్ గాంలో ఉగ్రవాదుల జరిపిన ఉన్మాద చర్యలతో యావత్ ప్రజలు, హిందూ సమాజం ఆవేశంతో రగిలిపోతోంది. ఎప్పుడెప్పుడు పాకిస్తాన్ పైన ప్రతీకార చర్యలు తీసుకుంటారా? అని ఆలోచిస్తున్నారన్నారు. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఒక దేశంతో యుద్ధం చేయాలంటే అనేక పర్యవసానాలు ఎదురవుతాయి. అన్నీ బేరీజు వేసుకున్న తరువాతే ఈ విషయంలో ముందుకు వెళ్లాలి. ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ అదే పనిలో ఉన్నారు. కానీ ఒక్కటి మాత్రం నిజం. యావత్ దేశ ప్రజలంతా సగర్వంగా గల్లా ఎగిరేసుకునేలా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోంది. అంతేకాదు, ఉగ్రవాదంపై పోరు విషయంలో మోదీ తెగువ, పట్టుదల, పోరాట పటిమను కూడా యావత్ ప్రపంచానికి తెలిసిరాబోతోంది అని తెలిపారు

దేశంలోకి ఉగ్రవాదులు చొరబడి బాంబు పేలుళ్లు, కాల్పులకు పాల్పడుతున్నారనే ఇక్కడున్న కొంత మంది సహకారం ఉంటేనే సాధ్యమైతుంది. లుంబినీ పార్క్, దిల్ సుఖ్ నగర్, గోకుల్ చాట్ బాంబు పేలుళ్లకు ఉగ్రవాదులు పాల్పడ్డారంటే ఇక్కడున్న కొందరు సహకరించడంవల్లే జరిగింది. జగిత్యాల, కోరుట్ల పీఎఫ్ఐకి అడ్డాగా మారాయి. బహిరంగంగా పీఎఫ్ఐ కార్డులుతో ర్యాలీలు నిర్వహించినా కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు కనీసం కేసులు కూడా పెట్టలేదు. ఈ తరుణంలో జరగబోయే హిందూ ఏక్తా యాత్ర సందర్భంగా హిందువులంతా హాజరై ఐక్యతను ప్రదర్శించి సత్తాను చాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు .

ఉగ్రవాదుల, దేశద్రోహుల వెన్నులో వణుకుపుట్టేలా కరీంనగర్ లో ఈనెల 22న కనీవినీ ఎరగని రీతిలో హిందూ ఏక్తా యాత్రను నిర్వహించబోతున్నాం. ఒక్క కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే లక్ష మందికి తక్కువ కాకుండా హిందువులంతా హాజరవుతారని అంచనా వేస్తున్నాం. హిందువులంతా ఈ యాత్రకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్ ల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఈ యాత్రకు తరలివచ్చేలా చూడాలని కోరుతున్నా. జీహెచ్ఎంసీ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ లో హిందువులంతా ఏకమయ్యారని, దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లలో వణుకు మొదలైంది. ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే ఏక్తా యాత్రతో తెలంగాణ వ్యాప్తంగా హిందువులంతా ఏకమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు..

# మే నెల వచ్చేసింది.. జాగ్రత్త..

భారతదేశంలో మండు వేసవిలో తరచుగా భరించలేని వేడిగాలులు వీస్తాయి. ఇది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారినే అధిక వేడి ప్రభావం చూపిస్తుంది. కొన్ని సందర్భాల్లో శరీరం ఒత్తిడికి గురై బలహీనపడి ప్రాణాంతక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మే నెలలో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు, కొన్నిరోజుల పాటు వేడిగాలుల తీవ్రత ఉంటుందని భారత వాతావరణ శాఖ (%×వీణ%) ఇప్పటికే ప్రజలను హెచ్చరించింది. కాబట్టి, వేసవిలో అధిక వేడి గాలుల వల్ల ప్రధానంగా ఈ 5 సమస్యలు రాకుండా చూసుకోండి.

**హీట్ వేవ్స్ అంటే ఏమిటి?**

వాతావరణంలో కొన్ని రోజుల నుంచి నెలల వరకు అసాధారణంగా వీచే వేడి గాలులను హీట్ వేవ్స్ అంటారు. హీట్ వేవ్స్ వల్ల వేడి, ఉక్కపోత తీవ్రమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో నివసించేవారికి, తిరిగేవారికి అనారోగ్య సమస్యలు దాడి చేసే అవకాశముంది.

**వడదెబ్బ**

వేసవిలో మధ్యాహ్నపు ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బ వస్తుందని తెలిసిందే. వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి వడదెబ్బ తీవ్రత ఉంటుంది. బలహీనంగా ఉన్న వారు వడదెబ్బకు గురైతే ప్రాణాలు పోయినా ఆశ్చర్యం లేదు. ముఖ్యంలో ఉష్ణోగ్రత 104ళీ%ఖీ (40ళీజ%) దాటినప్పుడు శరీరం ఉష్ణోగ్రతను నియంత్రించుకోలేదు. దీంతో వడదెబ్బ తగిలే ఛాన్స్ ఉంది. సమయానికి చికిత్స అందకపోతే ప్రాణాంతకం కావచ్చు.


**అలసట**

వేడి వల్ల వచ్చే అలసట చిన్న సమస్యలాగా అనిపించవచ్చు కానీ తీవ్రమైనది. చెమట ద్వారా శరీరం నీరు, ఉప్పు అధికంగా కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. సాధారణంగా తీవ్రమైన వేడి పరిస్థితులలో శారీరక శ్రమ చేసినా లేదా వ్యాయామం చేసినా ఈ సమస్య రావచ్చు.

**నిర్జలీకరణం**

తీవ్రమైన వేడిలో శరీరం నీటిని వేగంగా కోల్పోతుంది. వీటిని వెంటనే భర్తీ చేయకపోతే డీహైడ్రేషన్ సమస్య తలెత్తుంది. దీని వలన అలసట, తలనొప్పి, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గడం, తలతిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన నిర్జలీకరణం అవయవాల పనితీరును ప్రభావితం చేస్తుంది. వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులకు ఇది చాలా ప్రమాదకరం.

**తిమ్మిరి**




తీవ్రమైన వేడి పరిస్థితులలో శారీరకంగా ఎక్కువ కష్టపడినప్పుడు చేసినప్పుడు కండరాల నొప్పులు తీవ్రంగా బాధిస్తాయి. ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, అధిక చెమట కారణంగా శరీరం వేగంగా ద్రవాలను కోల్పోవడం వల్ల ఈ సమస్య వస్తుంది. సాధారణంగా కడుపు, చేతులు లేదా కాళ్ళలోని కండరాలు తిమ్మిరిగా ఉన్నట్టు అనిపిస్తాయి.

**చర్మ సమస్యలు**

ఎక్కువసేపు ఎండలో ఉండటం వల్ల వడదెబ్బ తగలవచ్చు. అతినీలలోహిత (UV) కిరణాల నేరుగా చర్మాన్ని తాకడం వల్ల ఇలా జరుగుతుంది. తీవ్రమైన వడదెబ్బ వల్ల చర్మం నల్లబడటమే కాదు. ఊడిపోయి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. కాలక్రమేణా చర్మ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

# యువతలో పెరుగుతున్న గుండెపోటు కేసులు..



చిన్నా పెద్దా తేడా లేకుండా ఇప్పుడు అన్ని వయసువారికీ ఇప్పుడు హార్ట్ ఎటాక్ వస్తోంది. కానీ, ఒక మంచి విషయం ఏంటంటే నివారణ మార్గం చేతుల్లోనే ఉంది. మీ గుండె పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే గుండెపోటుకు కారణాలేంటో అర్థం చేసుకోవడం చాలా అవసరం. గత 15 సంవత్సరాలుగా గుండెపోటు కేసులు యువతలో పెరగడానికి ప్రధాన కారణం అనారోగ్యకరమైన జీవనశైలి. 7 - 8 ప్రధాన కారణాలు ఉన్నప్పటికీ ఆరోగ్యకరమైన జీవ-నశైలిని అవలంబించడం ద్వారా హార్ట్ అటాక్ రాకుండా చూసుకోవచ్చు. మరి, గుండెపోటుకు ముఖ్య కారణాలు, రక్షించుకునే మార్గాలు ఇప్పుడు చూద్దాం.

గుండెపోటు నియంత్రించాలంటే ముందుగా జీవనశైలిలో మీరు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం డాక్టర్లు సూచిస్తున్నారు. ఈ మార్పులను మీరే నియంత్రించుకోవచ్చు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే 50 శాతం పైగా యువత కొన్ని చెడు అలవాట్లు కామన్ గా అనుసరిస్తున్నారు. ఇందులో వ్యాయామానికి దూరంగా ఉండటం, తక్కువ శారీరక శ్రమ చేయడం. ఎక్కువ నడవకపోవడం, రోజంతా ఒకే చోట కూర్చోవడం, ధూమపానం, ఊబకాయం వంటివి. ఇవే గుండెపోటు లేదా గుండెజబ్బులు పెరగడానికి ప్రధాన కారణం. అధిక మొత్తంలో మద్యం సేవించేవారికి హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు మరీ ఎక్కువ. దీనితో పాటు, పెరిగిన ఒత్తిడి, సరైన ఆహారం లేకపోవడం కూడా గుండె జబ్బులు వచ్చేందుకు మార్గం వేస్తున్నాయి.

**గుండెపోటుకు ప్రధాన కారణాలు**

కుటుంబంలో తండ్రి, తల్లి లేదా తోబుట్టువులకు గుండె సంబంధిత వ్యాధులు ఉన్నా కూడా గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ అనేవి గుండెపోటుకు మూడు ప్రధాన కారణాలు. ప్రస్తుతం ఈ అనారోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. అయితే, ఈ మూడింటిని సులభంగా నియంత్రించవచ్చు. తద్వారా, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

**గుండెపోటును ఎలా నివారించాలి?**

మీ పాదాలకు పనిచెప్పారంటే గుండెపోటును నివారించడం చాలా సులభం. ఎలా అంటే క్రమం తప్పకుండా నడవడం, శారీరక శ్రమ, వ్యాయామం చేయడం ద్వారా మీరు గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. వ్యాయామం మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మధుమేహం, రక్తపోటును నియంత్రించడంలో, ఊబకాయాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. ఇది ఒత్తిడి, కొలెస్ట్రాల్ స్థాయిలను కూడా తగ్గిస్తుంది. అదే సమయంలో ధూమపానం, అధికంగా మద్యపానం వంటి అనారోగ్యకరమైన అలవాట్లను వదిలించుకోవడానికి మిమ్మల్ని శక్తివంతం చేస్తుంది. ఈ ప్రయోజనాలే కాదు. సాధారణ శారీరక శ్రమ మీ మందుల అవసరాన్ని సగానికి సగం తగ్గించి మిమ్మల్ని ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచుతుంది.

# పంజాబ్ అద్భుత ప్రదర్శన

**37 రన్స్ తేడాతో లఖ్‌నవూ ఓటమి**

**ప్రభ్‌సిమ్రన్ సూపర్ ఇన్నింగ్స్**

**అర్ష్‌దీపనకు మూడు వికెట్లు**

**ప్రభ్‌సిమ్రన్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 91)**



ధర్మశాల: అన్ని విభాగాల్లో రాణిస్తూ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తున్న పంజాబ్ కింగ్స్ నుంచి మరో అద్భుత ప్రదర్శన. యువ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 91) తుఫాన్ ఆటతీరుతో విరుచుకుపడగా.. పేసర్ అర్ష్‌దీప్ (4-0-16-3) పొదుపైన బౌలింగ్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బెంబేలెత్తింది. ఫలితంగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రేయాస్ సేన 37 పరుగులతో ఘనవిజయం అందుకుంది. దీంతో ఏడు విజయాలు, 15 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. తమకు మిగిలిన మూడు మ్యాచుల్లో ఒక్కటి నెగ్గినా.. పంజాబ్ ప్లేఆఫ్సకు చాన్స్ ఉంటుంది. అటు లఖ్‌నవూ రాబోయే మూడు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 236 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 45), శశాంక్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 33 నాటౌట్) రాణించారు. ఆకాశ్, దిగ్వేష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులకే పరిమిత మైంది. ఆయుష్ బదోని (40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 74), అబ్దుల్ సమద్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీపనకు 3, అజ్మతుల్లాకు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రభ్‌సిమ్రన్ నిలిచాడు.

**బదోని-సమద్ పోరాటం:**

భారీ ఛేదనలో లఖ్‌నవూ ఆరంభంలోనే చతికిలపడింది. టాపార్డర్ పేలవ ఆటతీరుతో జట్టు ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేకపోయింది. చివర్లో బదోని, సమద్ పోరాటం ఏమాత్రం సరిపోలేదు. కెప్టెన్ రిషభ్ పంత్ (18) నిరాశాజనక ప్రదర్శన ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఓపెనర్లు మార్ష్ (0), మార్‌క్రమ్ (13)లను పేసర్ అర్ష్‌దీప్ మూడో ఓవర్‌లోనే అవుట్ చేయడంతో జట్టుకు గట్టి ఝలక్ తగిలింది. తన మరుసటి ఓవర్‌లోనే ప్రమాదకర పూరన్ (6)ను కూడా అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో 27/3 స్కోరుతో లఖ్‌నవూ కష్టాల్లో పడింది. దీనికి తోడు పేసర్ అజ్మతుల్లా పంత్, మిల్లర్ (11)లకు చెక్ పెట్టాడు. పది ఓవర్లలోనే సగం వికెట్లు కోల్పోయిన వేళ యువ ఆటగాళ్లు బదోని, సమద్ తెగువ చూపారు. 12వ ఓవర్‌లో బదోని 6,4,4.. సమద్ 6తో 21 పరుగులు వచ్చాయి. చాహల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదిన సమద్.. స్టొయినిస్ ఓవర్‌లో 4,6తో సత్తా చాటాడు. చివరకు జాన్సన్ రిటర్న్ క్యాచ్‌తో సమద్ వెనుదిరగ్గా ఆరో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బదోని మాత్రం ధాటిని కొనసాగిస్తూ 18వ ఓవర్‌లో 6,6,4తో 18 రన్స్ అందించాడు. కానీ చివరి ఓవర్‌లో 49 రన్స్ కావాల్సిన వేళ.. తొలి బంతికే బదోని అద్భుత ఇన్నింగ్స్ ముగియడంతో లఖ్‌నవూ చేసేదేమీ లేకపోయింది.

**చెలరేగిన ప్రభ్‌సిమ్రన్:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ అంతా తానై కదం తొక్కించాడు. ఆరంభంలో ఇన్‌గ్లిస, మిడిలార్డర్‌లో శ్రేయాస్ అతడికి సహకారం అందించారు. ఇక చివర్లో శశాంక్ జత కలవడంతో స్కోరు అవలీలగా 220 దాటేసింది. మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (1) తొలి ఓవర్‌లోనే అవుటైనా.. ఇన్‌గ్లిస వచ్చీ రావడంతోనే 4,6,6,6తో ధాటిని చూపాడు. నాలుగో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ 6,6,4తో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఇన్‌గ్లిసను ఆకాశ్ అవుట్ చేయగా, ఆరో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ క్యాచ్‌ను పూరన్ వదిలేశాడు. అయితే పవర్‌ప్లేలో జట్టు 66/2తో పటిష్ట స్థితిలోనే నిలిచింది. అలాగే మధ్య ఓవర్లలో అడపాదడపా బౌండరీలతో ప్రభ్‌సిమ్రన్-శ్రేయాస్ జోడీ జోరు కనబర్చింది. అటు 30 బంతుల్లో ప్రభ్‌సిమ్రన్ ఈ సీజన్‌లో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే శ్రేయాసను స్పిన్నర్ దిగ్వేష్ వెనక్కి పంపడంతో మూడో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నేహాల్ వధేరా (16) నిరాశపర్చగా.. శశాంక్ ఆఖర్లో వేగం చూపాడు. అవేశ్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో శశాంక్ 4,4.. ప్రభ్‌సిమ్రన్ 6,4,6తో 26 పరుగులు సమకూరాయి. కానీ సెంచరీకి చేరువలో ప్రభ్‌సిమ్రన్‌ను దిగ్వేష్ క్యాచవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి ఓవర్‌లో 18 రన్స్‌తో పంజాబ్ స్కోరు 230 దాటింది.

**స్కోరుబోర్డు**

పంజాబ్: ప్రియాన్ష్ (సి) మయాంక్ (బి) ఆకాశ్ 1, ప్రభ్‌సిమ్రన్ (సి) పూరన్ (బి) దిగ్వేష్ రాఠి 91, ఇన్‌గ్లిస్ (సి) మిల్లర్ (బి) ఆకాశ్ 30, శ్రేయాస్ (సి) మయాంక్ (బి) దిగ్వేష్ రాఠి 45, నేహాల్ (బి) ప్రిన్స్ 16, శశాంక్ (నాటౌట్) 33, స్టొయినిస్ (నాటౌట్) 15, ఎక్స్‌ట్రాలు: 5బీ మొత్తం: 20 ఓవర్లలో 236/5బీ వికెట్ల పతనం: 1-2, 2-50, 3-128, 4-162, 5-216బీ బౌలింగ్: ఆకాశ్ సింగ్ 4-0-30-2, మయాంక్ 4-0-60-0, అవేశ్ ఖాన్ 4-0-57-0, దిగ్వేష్ రాఠి 4-0-46-2, ప్రిన్స్ యాదవ్ 4-0-43-1.

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (బి) అర్ష్‌దీప్ 13, మార్ష్ (సి) నేహాల్ (బి) అర్ష్‌దీప్ 0, పూరన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 6, పంత్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 18, బదోని (సి) అర్ష్‌దీప్ (బి) చాహల్ 74, మిల్లర్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 11, అబ్దుల్ (సి అండ్ బి) జాన్సెన్ 45, అవేశ్ (నాటౌట్) 19, ప్రిన్స్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 12బీ మొత్తం: 20 ఓవర్లలో 199/7బీ వికెట్ల పతనం: 1-15, 2-16, 3-27, 4-58, 5-73, 6-154, 7-188బీ బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-16-3, జాన్సెన్ 4-0-31-1, అజ్మతుల్లా 4-0-33-2, చాహల్ 4-0-50-1, వైశాఖ్ 3-0-49-0, స్టొయినిస్ 1-0-17-0.

# పోరాడి ఓడిన రాజస్థాన్

**పరాగ్ భయపెట్టినా..**
**గట్టెక్కిన కోల్‌కతా**
**రస్సెల్ మెరుపులు**





కోల్‌కతా: ఆఖరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ గట్టెక్కింది. ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. ఆదివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆండ్రీ రస్సెల్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 57 నాటౌట్), రఘువంశీ (44), రహ్మానుల్లా గుర్బాజ్ (35), కెప్టెన్ అజింక్యా రహానె (30) రాణించారు. ఛేదనలో ఓవర్లన్నీ ఆడి 205/8 స్కోరు చేసిన రాజస్థాన్ విజయానికి పరుగు దూరంలో నిలిచిపోయింది. సారథి రియాన్ పరాగ్ (45 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 95), యశస్వీ జైస్వాల్ (34), హెట్‌మయర్ (29) పోరాటం సరిపోలేదు. హర్షిత్, వరుణ్, మొయిన్ అలీ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

**ఆశలు రేపి..:**

ఛేదనలో రాజస్థాన్ 71/5తో కష్టాల్లో పడింది. ఈ దశలో పరాగ్, హెట్‌మయర్ ఆరో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేకెత్తించారు. ముఖ్యంగా పరాగ్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. 13వ ఓవర్‌లో అలీ బౌలింగ్‌లో పరాగ్ ఏకంగా ఐదు సిక్స్‌లతో 32 పరుగులు పిండుకోవడంతో.. రాజస్థాన్ ఒక్కసారిగా మ్యాచ్‌లోకి వచ్చింది. అయితే, హెట్‌మయర్‌ను అవుట్ చేసిన హర్షిత్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. చివరి 3 ఓవర్లలో 38 పరుగులు కావాల్సి ఉండగా.. పరాగ్‌ను కూడా హర్షిత్ వెనక్కిపంపాడు. ఆఖరి 6 బంతుల్లో రాజస్థాన్ విజయానికి 22 పరుగులు అవసరమవగా.. వైభవ్ అరోరా బౌలింగ్‌లో శుభం దూబె (14 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 25 నాటౌట్) 6,4,6 బాదడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చివరి బంతికి మూడు పరుగులు కావాల్సి ఉండగా.. దూబే సింగిల్ మాత్రమే తీశాడు. రెండో పరుగు కోసం వచ్చిన ఆర్చర్ (12) రనౌటయ్యాడు. అంతకుముందు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (4) నిరాశపర్చగా.. కునాల్ సింగ్ (0), జైస్వాల్‌ను అలీ పెవిలియన్ చేర్చాడు. ధ్రువ్ జురెల్ (0), హసరంగ (0)ను వరుణ్ అవుట్ చేశాడు.

**దంచేసిన రస్సెల్..:**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. ఓపెనర్ నరైన్ (11) వికెట్‌ను వేగంగా కోల్పోయింది. కానీ, గుర్బాజ్, రహానె రెండో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. గుర్బాజ్‌ను తీక్షణ అవుట్ చేసినా.. రఘువంశీతో కలసి రహానె స్కోరు బోర్డును నడిపించాడు. దీంతో జట్టు స్కోరు 12వ ఓవర్‌లో సెంచరీ మార్క్ దాటింది. కానీ, కీలక సమయంలో రహానెను పరాగ్ అవుట్ చేశాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రస్సెల్.. రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రఘువంశీ జతగా నాలుగో వికెట్‌కు 33 బంతుల్లోనే 61 పరుగులు జోడించాడు. రఘువంశీని ఆర్చర్ వెనక్కిపంపగా.. ఆ స్థానంలో వచ్చిన రింకూ సింగ్ (6 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 19 నాటౌట్) 4,6,6తో ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో కోల్‌కతా స్కోరు డబుల్ సెంచరీ దాటింది.

**స్కోరుబోర్డు**

కోల్‌కతా: గుర్బాజ్ (సి) హెట్‌మయర్ (బి) తీక్షణ 35, నరైన్ (బి) యుధ్‌వీర్ 11, రహానె (సి) జురెల్ (బి) పరాగ్ 30, రఘువంశీ (సి/సబ్) అశోక్ (బి) ఆర్చర్ 44, రస్సెల్ (నాటౌట్) 57, రింకూ (నాటౌట్) 19బీ ఎక్స్‌ట్రాలు: 10బీ మొత్తం: 20 ఓవర్లలో 206/4బీ వికెట్ల పతనం: 1-13, 2-69, 3-111, 4-172బీ బౌలింగ్: ఆర్చర్ 4-0-30-1, యుధ్‌వీర్ 2-0-26-1, తీక్షణ 4-0-41-1, ఆకాశ్ 3-0-50-0, హసరంగ 4-0-35-0, పరాగ్ 3-0-21-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) రింకూ (బి) అలీ 34, వైభవ్ సూర్యవంశీ (సి) రహానె (బి) అరోరా 4, కునాల్ (సి) రస్సెల్ (బి) అలీ 0, పరాగ్ (సి) అరోరా (బి) హర్షిత్ 95, జురెల్ (బి) వరుణ్ 0, హసరంగ (బి) వరుణ్ 0, హెట్‌మయర్ (సి) నరైన్ (బి) హర్షిత్ 29, శుభమ్ దూబె (నాటౌట్) 25, ఆర్చర్ (రనౌట్) 12బీ ఎక్స్‌ట్రాలు: 6బీ మొత్తం: 20 ఓవర్లలో 205/8బీ వికెట్ల పతనం: 1-5, 2-8, 3-66, 4-71, 5-71, 6-163, 7-173, 8-205బీ బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-50-1, మొయిన్ అలీ 3-0-43-2, హర్షిత్ 4-0-41-2, వరుణ్ 4-0-32-2, నరైన్ 4-0-27-0, రస్సెల్ 1-0-11-0.



## లంక.. ఏడేళ్లలో తొలిసారి

**భారత్‌పై గెలుపు**

**మహిళల ముక్కోణపు సిరీస్**

కొలంబో: ఆల్‌రౌండర్ నీలాక్షికా సిల్వా (33 బంతుల్లో 56) దూకుడైన బ్యాటింగ్‌తో ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత వన్డేలలో భారత్‌పై శ్రీలంక మహిళలు తొలి విజయం అందుకున్నారు. ముక్కోణపు వన్డే సిరీసలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 3 వికెట్లతో హర్మన్ సేనను ఓడించింది. టోర్నీలో రెండో విజయం సాధించిన శ్రీలంక ఫైనల్‌కు చేరువైంది. ఇక సిరీసలో భారత్‌కిది తొలి పరాజయం. అయితే ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో నెగ్గినందున ఈ ఓటమి హర్మన్ సేన ఫైనల్ చేరికపై ప్రభావం చూపే అవకాశం లేదు. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 275/9 స్కోరు సాధించింది. కీపర్ రిచా ఘోష్ (48 బంతుల్లో 58) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. జెమీమా (37), ప్రతికా రావల్ (35) పర్లేదనిపించారు. అనంతరం శ్రీలంక 49.1 ఓవర్లలో 278/7 స్కోరు చేసి నెగ్గింది.

సంక్షిప్తస్కోర్లు: భారత్: 50 ఓవర్లలో 275/9 (రిచా 58, జెమీమా 37, ప్రతికా రావల్ 35, హర్మన్ 30, చమరి అటపట్టు 3/43, సుగందికా కుమారి 3/44). శ్రీలంక: 49.1 ఓవర్లలో 278/7 (నీలాక్షిక 56, హర్షిత 53, కవిష 35, స్నేహ్ రాణా 3/45).



## బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?

ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. డీజే దువ్వాడ జగన్నాథం%-% మూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం%-% వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్ ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల రెట్రో తోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది. ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ కాంచన 4 లో నటిస్తోంది. కాంచన ఫ్రాంచైజీలో భాగంగా రాఠవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.




## అవనిగా మెరిసిపోతున్న త్రిష

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ డైరెక్టర్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ సినిమా విశ్వంభర. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇవాళ త్రిష పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఓ సరికొత్త పోస్టర్ ను రిలీజ్ చేసింది. విశ్వంభరలో త్రిష అవని పాత్రలో కనిపించనుంది. మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ లో త్రిష సంప్రదాయ చీరకట్టులో భలే మెరిసిపోయింది. త్రిష బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ పోస్టర్ కు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తూ త్రిష కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో వీఎఫ్ఎక్స్ భారీగా ఉండనున్నట్టు చిత్ర యూనిట్ ఇప్పటికీ క్లారిటీ ఇచ్చింది. చిరూ కెరీర్లోనే భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఓ వైపు షూటింగ్ ను నిర్వహిస్తూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేస్తూ మేకర్స్ నిర్మాణాన్ని చాలా వేగవంతం చేశారు. విశ్వంభరకు సంబంధించిన డబ్బింగ్ వర్క్ కూడా మొదలుపెట్టినట్టు చెప్తున్నారు. యువి క్రియేషన్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే త్రిష, చిరంజీవి కలిసి గతంలో స్టాలిన్ సినిమాలో నటించారు. అప్పట్నుంచి మళ్లీ ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి నటించింది లేదు. ఇప్పటికే విశ్వంభర పై మంచి అంచనాలు నెలకొన్నాయి. నాలుగు పదుల వయసులో కూడా త్రిష కెరీర్ పరంగా వరుస అవకాశాలతో దూసుకెళ్తుంది. పొన్నియన్ సెల్వన్ సినిమాలతో సెకండ్ ఇన్నింగ్స్ ను స్టార్ట్ చేసిన త్రిష ఆ తర్వాత పలు స్టార్ హీరోలతో కలిసి నటించింది. ప్రస్తుతం త్రిష విశ్వంభర తో పాటూ థగ్ లైఫ్, సూర్య45, రామ్ సినిమాల్లో నటిస్తోంది.



## ఎట్టకేలకు ఫరియా ఫిక్స్ చేసిందా?

జాతి రత్నాలు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా ఆ సినిమాతో మంచి హిట్ ను అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ఆఖరిగా మత్తు వదలరా2 లో కనిపించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఆ తర్వాత ఫరియా నుంచి మరో సినిమా వచ్చింది లేదు.

అయితే తాజాగా ఇప్పుడు ఫరియా ఇన్‌స్టాగ్రమ్ లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. ఫరియా ఓ ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన ఓ టీజర్ ను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ది టైటిల్ ఈజ్ హిజ్ నేమ్, అతని ఆటకు రెడీ గా ఉండు. మ్యాడ్‌నెస్ స్టార్ట్ కానుందంటూ ఆ పోస్టర్ కింద రాసి ఉంది. %వీజీవీ% మోషన్ పిక్చర్స్, బురా, సద్ది క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్లు ఆ సినిమాను సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. అమర్ బురా, జయకాంత్, వేణు సిద్ది ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా నటిస్తున్నానని డైరెక్ట్ గా చెప్పకపోయినప్పటికీ ఆ టీజర్ ను ఆమె షేర్ చేయడం వెనుక ఉద్దేశం అదే అని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సంవత్సరం తర్వాత ఫరియా సినిమా ఓకే చేసిందని, ఈ ప్రాజెక్టుతోనే ఫరియా మళ్లీ స్క్రీన్ పైకి రానుందని వారు భావిస్తున్నారు. ఫరియా షేర్ చేసిన ఆ టీజర్ డార్క్ కామెడీ మూవీ అని తెలుస్తోంది. ఫరియా పోస్ట్ ఆమె కంబ్యాక్ ను సూచిస్తే, తెలుగు మూవీ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ టైమ్ లో ఆమె కూడా ఒక అధ్యాయంలోకి అడుగుపెట్టినట్టే అవుతుంది. మరి ఈ సినిమా అయినా ఫరియాకు మంచి హిట్ ను అందించి, తనను బిజీ ఆర్టిస్టుగా మారుస్తుందేమో చూడాలి.


EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com